# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com


**నేటి కందం-నేటికి అందం**

పావన దేశమునకు నవ
జీవన మొసగుటకు తనదు జీవిత మనుచున్
భావించెడి మోడీకై
సేవా సంకల్ప యాత్ర చేసిరి సుజనుల్ !!

ప్రజా జీవితంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా,దేశ ప్రధాన మంత్రిగా ఇరవై అయిదు సంవత్సరాలు సేవ చేసిన మోడీ గారి గౌరవార్థం మన రెండు తెలుగు రాష్ట్రాల తోబాటు దేశమంతటా జరిగిన "సేవా సంకల్ప యాత్ర" దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసింది.



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

సర్ పైన కారుకేలా
సాగుతున్న మౌనవ్రతం
కమలంతో దోస్తానిని
కోరుకుందా మనోగతం.
ఒకదిక్కు దేశమంతా
ఓట్ల తొలిగింపు లొల్లి
ఏ పార్టీ దూరమున్నా
ఏకాకిగా కాదా మల్లీ



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ శుక్రవారం 9-10-2026    NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.    సంపుటి :33 సంచిక:59 పేజీలు:6 వెల: రూ.1/-


# కెనడాకు చెందిన ఆన్ కార్సన్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం!



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8: సాహిత్య ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ బహుమతి మరోసారి ఓ విశిష్ట రచయితను వరించింది. 2026 సాహిత్య నోబెల్ బహుమతిని కెనడియన్ రచయిత్రి, కవయిత్రి ఆన్ కార్సన్‌కు ప్రదానం చేశారు. శాస్త్రీయ సంప్రదాయంతో వినోదాత్మకంగా, సృజనాత్మకంగా సంభాషిస్తూ.. సమకాలీన సాహిత్యానికి కొత్త రూపాలను పరిచయం చేసినందుకు ఆమెను ఈ పురస్కారం వరించింది.

ఆన్ కార్సన్ పేరు ప్రపంచ సాహిత్యంలో ప్రత్యేకమైనది. కవిత్వం, గద్యరచన, అనువాదం, పురాతన గ్రీకు సాహిత్య అధ్యయనం.. ఇలా భిన్న రంగాలను కలుపుతూ ఆమె తనదైన శైలిని రూపొందించారు. ఆమె రచనల్లో సంప్రదాయ సాహిత్య భావనలు, ఆధునిక ఆలోచనలు కలిసిపోతాయి.

**పదాలతో ప్రయోగాలు..**

కార్సన్ రచనల్లో భాషకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఒక భాషావేత్త పదాల వెనుక దాగి ఉన్న అర్థాలను అన్వేషించినట్టుగా.. ఒక కవి కొత్త అనుభూతిని, కొత్త అర్థాన్ని వెతుక్కుంటూ సాగుతారు. ఈ రెండు లక్షణాల కలయికే ఆమె సాహిత్యానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది.ఆమె రచనల్లో పురాణాలు, చరిత్ర, ప్రేమ, మానవ సంబంధాలు, జ్ఞాపకాలు వంటి అంశాలు కొత్త కోణాల్లో కనిపిస్తాయి. సంప్రదాయ సాహిత్య రూపాలను అనుసరించడంతో పాటు.. వాటిని తనదైన ప్రయోగాలతో మార్చడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది.

**కవిత్వంతో మొదలై..**

ఆన్ కార్సన్ తన వృత్తి జీవితాన్ని కేవలం రచనకే పరిమితం చేయలేదు. కవిత్వం రాయడంతో పాటు అనువాదకురాలిగా, అధ్యాపకురాలిగా కూడా సేవలందించారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో బోధిస్తూ.. సాహిత్యంపై తన పరిశోధనను కొనసాగించారు.ప్రత్యేకంగా ప్రాచీన గ్రీకు సాహిత్యం, పురాణాల ప్రభావం ఆమె రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. పాత సాహిత్య సంప్రదాయాలను ఆధునిక ప్రపంచంతో అనుసంధానిస్తూ ఆమె సృష్టించిన రచనలు పాఠకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించాయి.

**సాహిత్యానికి కొత్త దారి..**

ఆన్ కార్సన్ రచనలను ఒకే సాహిత్య ప్రక్రియలోకి చేర్చడం అంత సులభం కాదు. కవిత్వం, వ్యాసం, అనువాదం, నాటకీయత.. ఇలా అనేక రూపాలను కలిపి ఆమె రచనలు సాగుతాయి. అందుకే సమకాలీన సాహిత్యంలో ప్రయోగాత్మక రచనలకు ఆమెను ఓ ప్రత్యేక స్వరంగా పరిగణిస్తారు. ఆమె సాహిత్య ప్రయాణంలో ప్రధానంగా కనిపించేది 'కొత్త అర్థం కోసం అన్వేషణ'. సాధారణంగా కనిపించే పదాలు, కథలు, పురాణాల వెనుక దాగి ఉన్న భావాలను వెలికితీసే ప్రయత్నం ఆమె రచనల్లో కనిపిస్తుంది.కెనడాకు చెందిన ఆన్ కార్సన్ ఇప్పటికే అంతర్జాతీయ సాహిత్య ప్రపంచంలో విశేష గుర్తింపు పొందారు. కవిత్వంలో ఆమె చేసిన ప్రయోగాలు, క్లాసికల్ సాహిత్యాన్ని ఆధునిక దృక్పథంతో పునఃపరిశీలించిన తీరు ఆమెను ఇతర రచయితల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టాయి.




# పది తరాలు గుర్తుంచుకునే పాత్రలో అభిమానులను మెప్పించారు..

## నానాపటేకర్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8: ప్రముఖ నటుడు, దర్శకుడు నానా పటేకర్ ఇవాళ (గురువారం) గుండెపోటు కారణంగా తుదిశ్వాస విడిచారు. ఆయన తన మరణంపై గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. తన దహన సంస్కారాలు ఎలా చేయాలో నానా పటేకర్ వివరిస్తూ చెప్పిన మాటలను నెటిజన్లు గుర్తు చేసుకుంటున్నారు. 'నా దహన సంస్కారాల కోసం 12 మణుగుల (అంటే 480 కిలోలు) కట్టెలను ఇప్పటికే సిద్ధం చేసి ఉంచాను'అని ఓ ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) మృతిపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేవలం నటనలోనే కాకుండా, సమాజంలో తన నిక్కచ్చితనానికి, నమ్మిన సిద్ధాంతాల కోసం నిర్భయంగా మాట్లాడే వ్యక్తిగా ఆయనఎంతో మంది అభిమానాన్ని చూరగొన్నారని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం సినీ ప్రపంచానికి తీరని లోటన్నారు. కాగా, భారతీయ సినీ పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు నానా పటేకర్ కన్నుమూశారు. 75 ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడిచారు. గోవాలోని డోనా పౌలాలో ఉన్న తన నివాసంలో నానా పటేకర్ అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే కుటుంబ సభ్యులు, సిబ్బంది ఆయనను మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ప్రాణాలను కాపాడలేకపోయారు.

వైద్యుల ప్రకారం.. నానా పటేకర్ తీవ్రమైన గుండెపోటుకు గురైనట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఉదయం 5:20 గంటలకు ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఆసుపత్రికి తీసుకువచ్చిన అనంతరం దాదాపు 45 నిమిషాల పాటు నిరంతరంగా సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు వైద్య బృందం ప్రయత్నించింది. అయినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదని మణిపాల్ ఆసుపత్రి ఆంకాలజీ విభాగం చీఫ్ డాక్టర్ శేఖర్ సల్కర్ తెలిపారు. ఈ ఘటనపై మెడికో-లీగల్ కేసు కూడా నమోదు చేసినట్లు వెల్లడించారు. నానా పటేకర్ మరణానికి దారితీసిన పూర్తి పరిస్థితులపై కుటుంబ సభ్యుల నుంచి అధికారికంగా మరింత సమాచారం రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆయన ఆకస్మిక మరణవార్త బాలీవుడ్‌తో పాటు మరాఠీ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదాన్ని నింపింది.

# ఈసీపై ఇండియా కూటమి పోరు..

# 'ముందు లంచ్.. తర్వాత నిరసన' ఫార్ములా!




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8: ఢిల్లీలో ఎన్నికల కమిషన్‌పై ఇండియా కూటమి పోరు కొనసాగుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్ష ఎంపీలు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది.

ఈ నేపథ్యంలో కొత్త ఫార్ములాను ఫాలో అవుతున్నారు కూటమి నేతలు! 'ముందు లంచ్.. తర్వాత నిరసన!' అన్నట్టు సాగుతోంది వారి తీరు. బుధవారం సాగర్ రత్నలో భోంచేసి ఆందోళనకు బయలుదేరిన విపక్ష నేతల కోసం.. గురువారం మోయెట్స్ రెస్టారెంట్‌లో భోజనం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి రాజ్‌ఘాట్‌కు వెళ్లి నిరసన కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఎంపీలను తీసుకెళ్లేందుకు హోటల్ బయట బస్సులు కూడా సిద్ధం చేశారు. మొత్తంగా ఈసీపై పోరాటం నేపథ్యంలో రెస్టారెంట్లు, నిరసన ప్రదేశాలు మారినా.. లంచ్ తర్వాతే ఆందోళన అనే ఫార్ములా మాత్రం యథాతథంగా కొనసాగుతోంది.

కాగా.. బుధవారంనాడు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లి నిరసన చేపట్టేందుకు యత్నించిన విపక్ష నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ హైడ్రామాలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో షాంగ్రిలా హోటల్ వద్ద.. ప్రియాంక గాంధీ రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని రోడ్డుపై పడుకుని నిరసన తెలపగా.. రాహుల్ పోలీసుల వాహనంలోకి వెళ్లేందుకు నిరాకరించారు. ఈ క్రమంలో ప్రియాంకతో పాటు రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు పోలీసులు.

మరోవైపు రేపు(ఈ నెల 9న) రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ఇండియా కూటమి నేతలు భేటీ కానున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల సంఘంపై ఫిర్యాదు చేసేందుకు 15 మంది ఎంపీలతో భేటీ కోరగా.. 10 మంది సభ్యుల ప్రతినిధి బృందానికి రాష్ట్రపతి భవన్ అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ఖర్గే, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ వంటి ప్రముఖ నేతలు ఈ బృందంలో పాల్గొనే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా.. ఇండియా కూటమి నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు పోలీసులు. జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద అదనపు బలగాలను మోహరించారు.

# లోక్‌భవన్ వద్ద ఉద్రిక్తత.. మహేశ్ గౌడ్, మంత్రుల అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 8: లోక్‌భవన్ వద్ద ఆందోళనకు దిగిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు(గురువారం) 'ఛలో లోక్‌భవన్'కు కాంగ్రెస్, టీజేఏస్, లెఫ్ట్ పార్టీలు పిలుపునిచ్చాయి.

ఈ నిరసనలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఇండియా కూటమి రాష్ట్ర నేతలు పాల్గొని ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్ నుంచి లోక్‌భవన్ వైపు ర్యాలీగా బయలుదేరిన నేతలను అడ్డుకున్నారు.

లోక్‌భవన్‌కు 300 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. లోక్‌భవన్ వైపుకు రానీయకుండా ఆందోళనకారులను బారికేడ్లతో అడ్డుకున్నారు.

దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

వారిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు దేశవ్యాప్తంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి.

# రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం..

అమరావతి, అక్టోబర్ 8:పెందూరు నుంచి బంటుమిల్లి వస్తున్న జాతీయ రహదారి 216-ఏ మార్గంలోని బంటుమిల్లి కూడలి వద్ద రోడ్డుపై కే. శ్రీనివాసరావు బైక్‌ను ఆపి సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఉన్నారు. ఈ సమయంలో వెనుక నుంచి వస్తున్న వాహనాన్ని గమనించకుండా బైక్‌ను యూటర్న్ తీసుకోవడంతో.. పెందూరు నుంచి గణేష్‌నగర్ వైపు ప్లాటినా బైక్‌పై వస్తున్న కే. దుర్గారావు బైక్‌ను ఢీకొన్నారు. దీంతో రెండు బైకులకు మంటలు అంటుకుని అగ్నిప్రమాదం సంభవించింది.

సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సకాలంలో చర్యలు చేపట్టి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు.

# నా దహన సంస్కారాల్లో ఎండిన కట్టెలే వాడాలి.. నానా పాటేకర్ చివరి కోరిక

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:12 మణుగుల కట్టెలను తాను ఎండబెట్టానని నానా పటేకర్ చెప్పారు. ఈ ఎండిన కట్టెలతో మాత్రమే తన దహన సంస్కారాలు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కోరిక వెనుక కారణాన్ని కూడా వివరించారు.

'దయచేసి ఎండిన కట్టెలతోనే నన్ను దహనం చేయండి. తడివాటితో మాత్రం వద్దు. ఎందుకంటే తడి కట్టెలు వాడితే వచ్చే పొగ వల్ల అక్కడున్న వారికి కన్నీళ్లు వస్తాయి. అది చూసి నేను వారు నాకోసం ఏడుస్తున్నారేమో అని భ్రమపడతాను. మరణ సమయంలో ఇలాంటి గందరగోళం ఎందుకు చెప్పండి' అని చెప్పి, అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు.2023 సెప్టెంబర్‌లో 'ది వ్యాక్సిన్ వార్' సినిమా ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను నానా పటేకర్ వెల్లడించారు.

ఇదే ఇంటర్వ్యూలో మరణంపై తనకున్న తాత్విక అవగాహనను ఆయన ప్రేక్షకులతో పంచుకున్నారు. భౌతిక ఆస్తులు, సంపదలు అశాశ్వతమని, మరణం అనేది కఠినమైన వాస్తవమని తెలిపారు. నానా పటేకర్ మరణం తరువాత ఈ ఇంటర్వ్యూకు సంబంధించిన వీడియోను దర్శకుడు ఆర్జీవీ ఎక్స్‌లో షేర్ చేశారు కూడా.

# ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్, ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

నల్గొండ, అక్టోబర్ 8: అచ్చంపేట మండలం సిద్దాపూర్ గ్రామంలోని ప్రభుత్వ బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, విద్యాబోధన, హాజరు, మౌలిక వసతులపై అధికారులు ఆరా తీశారు.

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో భోజనం అందిస్తున్నారా. ఆహార నాణ్యత ఎలా ఉంది.. అనే అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధన తీరును, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు.

కొందరు విద్యార్థులు తరచూ గైర్హాజరవుతున్నట్లు గుర్తించిన అధికారులు.. అందుకు గల కారణాలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఏపీలో పెట్టుబడులే లక్ష్యం.. ఎంఓయూలను సాకారం చేస్తాం: సీఎం చంద్రబాబు

ఃఢిల్లీ, అక్టోబర్ 8: ఢిల్లీలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సీఐఐ సదస్సులో ముఖ్యమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఎంఓయూలను సాకారం చేసే అంశంపై ఎక్కువ దృష్టిసారించామని పారిశ్రామికవేత్తలకు వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను త్వరలో ప్రారంభించనున్నట్టు స్పష్టం చేశారు. బిల్డ్ ఏపీ నినాదంతో పని చేస్తున్నామని ప్రకటించారు.

25 ఏళ్లుగా నిరంతరాయ ప్రజాసేవలో ఉన్న ప్రధాని మోదీకి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ ఇన్‌ఫ్రాను దేశంలో తీసుకురావటంలో ప్రధాని మోదీది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. అత్యద్భుతమైన రోడ్ నెట్‌వర్క్ కలిగిన భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. రైల్వే నెట్‌వర్క్‌లోనూ దేశం కీలక స్థానంలో ఉందని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే, రోడ్ నెట్‌వర్క్ కలిగి ఉన్న బలమైన దేశాన్ని ప్రధాని తీర్చిదిద్దుతున్నారని వివరించారు. రక్షణ పరంగా అత్యంత భద్రత కలిగిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో ప్రధాని పాత్ర అత్యద్భుతమని కొనియాడారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో కీలకంగా ఉన్న భారతీయులు ప్రపంచవ్యాప్తంగా వివిధ కంపెనీలకు సారథ్యం వహిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ఏపీకి చేయూత ఇవ్వటంలో కేంద్రం, ప్రధాని మోదీ ముందున్నారని అన్నారు. పోలవరం, అమరావతి రాజధాని ప్రాజెక్టులతో పాటు వేర్వేరు ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారని చెప్పారు. విశాఖ సహా వివిధ ప్రాంతాల్లో సెమీ కండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. బిల్డ్ ఏపీ అనే నినాదంతో పని చేస్తున్నామని చెప్పారు. ఏపీలో సంపద సృష్టించటంతో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. గతేడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని.. గడచిన 28 నెలల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని అన్నారు. ఎంఓయూలకు మాత్రమే పరిమితం కావటం లేదని.. వాటిని పెట్టుబడులుగా మలిచేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ లాంటి ప్రముఖ కంపెనీలు ఏపీకి వచ్చాయని ముఖ్యమంత్రి అన్నారు. గతేడాది ప్రకటించిన మేరకు పారిశ్రామిక ప్రోత్సాహకాలను నవంబరు 12,13 తేదీల్లో ప్రారంభిస్తామని తెలిపారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నాలా యాక్టును రద్దు చేసేశామని చెప్పారు. గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు కలిస్తే ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరతే రాదని వెల్లడించారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయాలని నిర్దేశించుకున్నామని... సౌత్ ఈస్ట్ ఏషియాకు గేట్ వేగా ఏపీని మార్చటమే లక్ష్యమని స్పష్టం చేశారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు మజగావ్ డాగ్ యార్డ్ లిమిటెడ్ ముందుకు వచ్చిందన్నారు. మచిలీపట్నంలో గోవా షిప్ యార్డు సంస్థ నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అంగీకరించిందన్నారు. డ్రోన్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను కూడా తిరుపతి, లేపాక్షి, కొప్పర్తిలో ఏర్పాటు చేశామని తెలిపారు.

5వ తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టును కూడా రక్షణశాఖ రాయలసీమలో ప్రారంభించిందని చంద్రబాబు తెలిపారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిపై ఒప్పందాలు కుదిరాయని, గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్ మిషన్ కారిడార్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రగతిలో ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణం అమలు చేయడానికి ఏపీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ఏఐ సహా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలుగా తయారు చేసేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరుతో అంతర్జాతీయ మార్కెట్లకు ప్రమోట్ చేస్తామన్నారు. డేటా లేక్ లాంటి వ్యవస్థల ద్వారా ఏఐ స్టాక్ లాంటి సాంకేతికతతో వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. జీఎస్టీ పన్నుల వసూళ్లలో ఏఐ స్టాక్ అమలు చేయటం ద్వారా రాష్ట్రానికి ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు.

# సప్తవర్ణ ఇంద్రధనుస్సును చూపుతున్న కళ్లను సంరక్షించుకోలేమా !

## (08 అక్టోబర్ "ప్రపంచ దృష్టి దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆయుర్దాయం పెరుగుతున్నది. వయసుతో పాటు అంధత్వ లేదా దృష్టి లోప సమస్యలు పెరుగుతున్నాయి. ప్రపంచంలోని 45 మిలియన్ల అంధుల్లో 80 శాతం మంది 50 ఏండ్లు దాటిన వయోజనులు ఉన్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 90 శాతం వరకు అంధులు అల్పాదాయ దేశాల్లోనే ఉన్నారు. కటరాక్ట్, గ్లాకోమా, రిఫ్రాక్టివ్ ఎర్రర్ లాంటి నేత్ర సమస్యలు వృద్ధులను, మహిళలను ఇబ్బంది పెడుతున్నాయి. సమయానికి నేత్ర చికిత్స దొరకని పరిస్థితుల్లో దృష్టిని కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. నేత్ర సంరక్షణ, అంధత్వ నిర్మూలన - నివారణ అనబడే లక్ష్యాలతో అవగాహన కల్పించడానికి ప్రతి ఏట అక్టోబర్ మాసంలో 2వ గురువారం, అనగా 08 అక్టోబర్ 2026 రోజు విశ్వవ్యాప్తంగా "ప్రపంచ దృష్టి దినోత్సవం (వరల్డ్ సైట్ డే)" నిర్వహించడం జరుగుతున్నది.

### ప్రపంచ దృష్టి దినోత్సవం-2026 ఇతివృత్తం:

ప్రపంచ దృష్టి దినోత్సవం వేదికగా కంటి ఆరోగ్యం, మంచి చూపు, నేత్రాల సంరక్షణ పద్ధతులు లాంటి పలు అంశాల కేంద్రంగా పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. 2026 ప్రపంచ దృష్టి దినోత్సవం ఇతివృత్తంగా "మీ నేత్రాలను ప్రేమించండి (లవ్ యువర్ ఐస్)" అనే సందేశాన్ని ఇవ్వడం జరుగుతుంది. 1998లో లయన్స్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ తొలిసారి "సైట్ ఫస్ట్" కార్యక్రమం తీసుకోవడంతో ఈ దినోత్సవాన్ని స్థాపించారు. లయన్స్ సంస్థ చొరవతో ఉచిత నేత్ర పరీక్షలు, నేత్ర వైద్య సేవలు కల్పించడానికి కంటి ఆసుపత్రులను కూడా స్థాపించి అమూల్యమైన సేవలను అందుబాటులోకి తెచ్చారు. నయం చేయదగిన నేత్ర సమస్యలను అధిగమించి చూపును ప్రసాదించడమే ధ్యేయంగా లయన్స్ సేవలు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ తనదైన నేత్ర దవాఖానాలను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

### నేత్ర ఆరోగ్యానికి మార్గాలు:

నేత్రాల సంరక్షణ, దృష్టి ఆరోగ్యం, పలు ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల సహకారంతో మెరుగైన వైద్య సేవలు, క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు, దృష్టి ఆరోగ్యానికి మంచి పోషకాహార అలవాట్లు, దురలవాట్లకు దూరంగా ఉండటం, ప్రతి రోజు శారీరక వ్యాయామం లాంటి అంశాల చుట్టు ప్రపంచ దృష్టి దినం కార్యక్రమాలు తిరుగుతాయి. సామాన్యులు తమ జీవితం కాలంలో కూడా తమ నేత్రాల పరీక్షలను చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. దృష్టి సమస్య ఉత్పన్నం అయినపుడు మాత్రమే విధిగా నేత్ర వైద్యులను సంప్రదించడం జరుగుతోంది. అందరికీ అందుబాటులో నేత్ర పరీక్షా కేంద్రాలు, చవకైన లేదా ఉచిత పరీక్షలు/వైద్యం ఉండాలనే ప్రచారం కూడా కొనసాగుతున్నది.

నేడు వందకు పైగా ప్రపంచ దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. చూపు కోల్పోయిన తర్వాత ఏం చేసినా చీకటి బతుకే అవుతుందని గమనించి చూపు ఉండగానే దానిని నిలుపుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నేత్ర ఆరోగ్యం పట్ల అన్ని వర్గాల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడం, తరుచుగా ఉచిత నేత్ర పరీక్షా శిబిరాలను నిర్వహించడం జరగాలి. పంచేంద్రియాల్లో నయం ప్రధానం. చూపు లేనపుడు ఏది, ఎంత ఉన్నవారు చీకటే మిగులుతుందని గమనించి మన జీవితాల్లో సప్తవర్ణ ఇంద్రధనుస్సును చూడడానికి మన కళ్లల్లో వత్తులు పెట్టుకొని నేత్రాలను కాపాడుకుందాం.



-మధుపాళీ
9949700037

# హైదరాబాద్‌లో జరిగిన 'సంస్కరణ ఉత్సవం-2026'లో... పత్తి రైతులు, జౌళి పరిశ్రమ కోసం చేపట్టిన కీలక సంస్కరణలను ప్రదర్శించిన జౌళి మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, తన ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐ) ద్వారా తెలంగాణలోని హైదరాబాద్‌లో 'సంస్కరణల ఉత్సవం-2026' కింద ఒక ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించింది. పత్తి రైతుల సాధికారత, జౌళి పరిశ్రమ బలోపేతం, పత్తి వాల్యూ చెయిన్ అంతటా సామర్థ్యం, పారదర్శకత, వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన కీలక సంస్కరణలను ఈ కార్యక్రమంలో ప్రముఖంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ ఉత్పత్తి విభాగం కమిషనర్ (ఏపీసీ), వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి శ్రీ కె. సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సీసీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ లలిత్ కుమార్ గుప్తా... తెలంగాణ ప్రభుత్వ సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, మార్కెటింగ్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) శ్రీ రాహుల్ రాజ్ పి.ఎస్... సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సీఈవో, సంయుక్త కార్యదర్శి (టెక్నికల్) డాక్టర్ నరేష్ బాబు ఎన్... ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ ఎం. బలరాం తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, సీసీఐ, తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు పత్తి రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, ఇతర లబ్ధిదారులూ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్పాదకత పెంపు, కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు, నాణ్యత మెరుగుదల, వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని మరింత పెంచడం వంటి కీలక అంశాలపై అనుభవాలను పంచుకోవడానికి ఈ ఉమ్మడి వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని శ్రీ సురేంద్ర మోహన్ కొనియాడారు.సీసీఐ సంస్థ సీఎండీ శ్రీ లలిత్ కుమార్ గుప్తా మాట్లాడుతూ... పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడటంలో సంస్థ సాగించిన ప్రయాణాన్ని... పారదర్శకత, సాంకేతికత, రైతు సంక్షేమమే ధ్యేయంగా మారుతున్న సంస్థ విధానాన్ని ప్రముఖంగా వివరించారు. రైతులతో అనుసంధానాన్ని పెంచడం, పారదర్శకతను తీసుకురావడం, పనితీరును మెరుగుపరచడం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని, పత్తి వాల్యూ చెయిన్ అంతటా పోటీతత్వాన్నీ పెంపొందించడం కోసం సీసీఐ చేపట్టిన కీలక సంస్కరణలను శ్రీ లలిత్ కుమార్ వివరించారు.

ప్రభుత్వ ప్రధాన సంస్కరణలను వివరించే కొన్ని లఘు చిత్రాలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. వీటిలో పత్తి రైతులతో డిజిటల్ అనుసంధానాన్ని సులభతరం చేస్తూ పత్తి కొనుగోళ్లకు సంబంధించిన సమాచారాన్ని అందించే 'కపాస్ కిసాన్ యాప్'... దేశంలో పత్తి దిగుబడిని, నాణ్యతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్న 'పత్తి ఉత్పాదకత మిషన్- కపాస్ క్రాంతి'... జౌళి పరిశ్రమకు ముడిసరుకు సులభంగా లభించేలా పత్తిపై ఉన్న నాణ్యత నియంత్రణ ఉత్తర్వులను (క్యూసీవోలను) తొలగించడం... పత్తి బేళ్లు-గింజల బిల్లింగ్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసి పనితీరును వేగవంతం చేసే 'కాట్‌బిజ్' వంటి వినూత్న డిజిటల్ వ్యవస్థల ప్రదర్శనలు వీటిలో భాగంగా ఉన్నాయి.

పత్తి రైతులు తమ అనుభవాలను పంచుకునే ప్రత్యేక సమావేశం ద్వారా... క్షేత్రస్థాయిలో పత్తి సాగు, దిగుబడి, పత్తి రంగానికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న రైతు అనుకూల నిర్ణయాల వల్ల చేకూరిన ప్రయోజనాలను గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం రైతులకు లభించింది.

అకోలాకు చెందిన ఒక ప్రగతిశీల రైతు హై-డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ (హెచ్‌డీపీఎస్)తో తన అనుభవాన్ని పంచుకున్నారు. ఆ జిల్లాలో మొదట్లో కేవలం 5,000 హెక్టార్లలో మాత్రమే ఈ సాగు విధానాన్ని అనుసరించగా... ఇప్పుడు అది సుమారు 30,000 హెక్టార్లకు విస్తరించింది. దీనివల్ల ఎకరాకు పత్తి దిగుబడి 12 క్వింటాళ్ల నుంచి ఏకంగా 18 క్వింటాళ్లకు పెరిగే అవకాశం ఉంది అని ఆ రైతు తెలిపారు. సాంప్రదాయిక పద్ధతులతో పోలిస్తే ఈ హెచ్‌డీపీఎస్ విధానం వల్ల కూలీల కొరత సమస్య తీరుతుందని, యంత్రాల వాడకం సులభమవుతుందని, కలుపు నివారణ మెరుగ్గా సాగుతుందని, పెట్టుబడి ఖర్చులూ చాలా వరకు తగ్గుతాయని ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వ సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, మార్కెటింగ్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) శ్రీ రాహుల్ రాజ్ పి.ఎస్ మాట్లాడుతూ... కనీస మద్దతు ధర విధానం కింద జరుగుతున్న పత్తి కొనుగోలు ప్రక్రియలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పత్తి రైతులకు అండగా నిలవడంలో సమర్థమైన కొనుగోలు ఏర్పాట్లు, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం, ఎలాంటి అడ్డంకులు లేని పారదర్శక విధానం ఎంతో కీలకమని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ ఎం. బలరాం మాట్లాడుతూ... పత్తి ఉత్పాదకత, సంస్కరణల ఆధారిత చర్యలను ప్రస్తావించారు. భారతీయ పత్తి దిగుబడిని, నాణ్యతను పెంచడం కోసం శాస్త్రీయ సాగు పద్ధతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, రైతులు, పరిశ్రమల మధ్య ఉమ్మడి సహకారం చాలా అవసరమని ఆయన స్పష్టం చేశారు. సెంట్రల్ సిల్క్ బోర్డ్ (సీఎస్‌బీ) చేపట్టిన కీలకమైన పలు నూతన విధానాలనూ ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. బెంగళూరుకు చెందిన సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సీఈవో, సంయుక్త కార్యదర్శి (టెక్నికల్) డాక్టర్ నరేష్ బాబు మాట్లాడుతూ... సిల్క్ మార్క్ డిజిటలైజేషన్, సెరీ-టూరిజం సంబంధిత ప్రణాళికలను వివరించారు. బెంగళూరు సీఎస్‌బీ సైంటిస్ట్-సి డాక్టర్ విశాఖ 'మేరా రేషమ్ మేరా అభిమాన్' (ఎంఆర్ ఎంఏ) కార్యక్రమం గురించి సభకు వివరించారు.

తెలంగాణ కాటన్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ బొమ్మినేని రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... కస్తూరి కాటన్ నాణ్యత, కొనుగోలు, ప్రాసెసింగ్ విధానాలపై జిన్నింగ్, ప్రెస్సింగ్ పరిశ్రమ దృక్పథాన్ని పంచుకున్నారు. పత్తి నాణ్యతను పెంచడంలో, రైతులకు-జౌళి పరిశ్రమకు మధ్య బంధాన్ని బలోపేతం చేయడంలో వ్యాపార భాగస్వాముల పాత్రనూ ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. టెక్స్‌ప్రోసిల్ జాయింట్ డైరెక్టర్ శ్రీ ఉదయ్ కారత్... భారతీయ పత్తి నాణ్యత పెంపు, సర్టిఫికేషన్, బ్రాండింగ్, మూలాలను గుర్తించే విధానం కోసం 'కస్తూరి కాటన్ భారత్' కింద చేపట్టిన నిర్మాణాత్మక పద్ధతులపై వీడియోలను ప్రదర్శించారు. శ్రీ సాలసార్ బాలాజీ టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ధీరజ్ ఖేతాన్... స్పిన్నింగ్ పరిశ్రమ దృక్కోణంలో కస్తూరి కాటన్ నాణ్యతతో తన అనుభవాన్ని పంచుకున్నారు. అంతర్జాతీయ వస్త్ర మార్కెట్‌లో భారతీయ పత్తి పోటీతత్వాన్ని, స్థానాన్ని బలోపేతం చేయడానికి నాణ్యత, స్థిరత్వం, విలువ జోడింపు ఎంత కీలకమో ఆయన వివరించారు.

పత్తి, పట్టు రంగంలోని రైతులు, భాగస్వాములు, పారిశ్రామికవేత్తలూ సీసీఐ, సీఎస్‌బీ కార్యక్రమాలతో తమ అనుభవాలను పంచుకున్నారు. పత్తి, పట్టు వాల్యూ చెయిన్ బలోపేతంలో డిజిటల్ పద్ధతులను అవలంబించడం, ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం, లబ్ధిదారుల మధ్య మెరుగైన అనుసంధానం ఎంతటి గొప్ప మార్పులను తీసుకురాగలవో వారు వివరించారు.

సీసీఐ, సీఎస్‌బీ చేపట్టిన సంస్కరణలను ప్రముఖంగా ప్రదర్శించేందుకు ఈ ప్రదర్శన కార్యక్రమం ఒక చక్కని వేదికను అందించింది. విధాన నిర్ణేతలు, రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక సంస్థల మధ్య ఒక అర్థవంతమైన పరస్పర చర్చకు ఇది ఎంతగానో దోహదపడింది. ఈ సదస్సులో నిర్వహించిన ప్రదర్శనలు, అనుభవాలను పంచుకునే సెషన్లు... పత్తి, పట్టు వాల్యూ చెయిన్ అంతటా పనితీరు సామర్థ్యం, పారదర్శకత, ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంపొందించడంలో ఆధునిక సాంకేతికతను అవలంబించడం, విజ్ఞానాన్ని పంచుకోవడం, భాగస్వాముల ఉమ్మడి సహకారం ఎంత ముఖ్యమో స్పష్టం చేశాయి. రైతు సంక్షేమ సంస్కరణలు, ఉత్పాదకత-నాణ్యత పెంపు, డిజిటల్ విప్లవం, వ్యాపార అనుకూల వస్త్ర రంగాన్ని అందించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసింది. భారత జౌళి రంగ వాల్యూ చెయిన్‌ను - ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్ వరకు - మరింత ఉత్పాదకతతో, పటిష్ఠంగా, ప్రపంచంతో పోటీ పడేలా మార్చాలనే విస్తృత దార్శనికత సాకారంలో ఈ వినూత్న కార్యక్రమాలు బలమైన మద్దతును అందిస్తాయి.




# ఇంటి ఆవరణలో గంజాయి సాగు..

### పోలీసుల దాడిలో మూడు మొక్కలు స్వాధీనం.. నిందితుడిపై కేసు నమోదు

ఆదిలాబాద్, అక్టోబర్ 8 రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ ల పర్యవేక్షణలో కోటపల్లి ఎస్ఐ శివనీతి రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ జె. లక్ష్మణరావులు పోలీసు సిబ్బంది తో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు ఎదుళ్లబందం గ్రామానికి చెందిన దుర్గం మహేష్ (33), తండ్రి చంద్రయ్య ఇంటి ఆవరణలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఇంటి ఆవరణలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలకు, మహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ సాగు చేస్తున్న మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న మొక్కలను వ్యవసాయ శాఖ ఏఈఓ పరిశీలించి అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. వీటిలో రెండు మొక్కలు 12 అంగుళాలు, మరో మొక్క 14 అంగుళాల ఎత్తు ఉన్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మూడు మొక్కల విలువ సుమారు రూ.4,600 ఉంటుందని అంచనా వేశారు.గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రాజశేఖర్ సూచించారు.

# నాణ్యమైన రహదారి మౌలిక సదుపాయాల కోసం సహకార పద్ధతిలో జ్ఞానాన్ని పంచుకోవడంపై దృష్టి సారిస్తూ... ముగిసిన 'చింతన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: నాణ్యమైన రహదారి మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర-రాష్ట్ర సహకారాన్ని బలోపేతం చేయడం, క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకోవడం, సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించిన రెండు రోజుల "చింతన్ శిబిరం 2026 - రహదారి మౌలిక సదుపాయాలపై జాతీయ సదస్సు" ఈ రోజు ముగిసింది. గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో గల స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ఈ సదస్సును నిర్వహించారు.

ముగింపు సమావేశంలో రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ వి. ఉమాశంకర్ మాట్లాడుతూ... జాతీయ రహదారులు, రహదారుల రంగానికి సంబంధించిన ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ఈ 'చింతన్ శిబిరం' కల్పించిందని పేర్కొన్నారు.

# ప్రతి కూలికి ఉపాధి కల్పించాలి

### -డీఆర్‌డీఓ బానోత్ దత్తారామ్

ఆదిలాబాద్, అక్టోబర్ 8అర్హులైన ప్రతి కూలికి వీబీజీ



రాంజీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోత్ దత్తారామ్ కోరారు.

ఆయన గురువారం జైనూర్ మండలంలోని భూసిమెట్ట పంచాయతీలో జరుగుతున్న వీబీజీ రాంజీ పనులను సర్పంచ్ ఆత్రం సింధు నగేశ్‌తో కలిసి పరిశీలించారు. కూలీలు ఫారం ఫండ్ చేస్తున్న పనులను పరిశీలించి కొలతల ప్రకారంగా పనులు నిర్వహించాలని కోరారు. ప్రతి కూలీకి ఉపాధి కల్పించి ప్రజలు కోరుకున్న పనులు రైతులకు ప్రజలకు ఉపయోగ పనులపై దృష్టి సారించాలని కోరారు. కూలీలతో పనుల విషయంపై వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్రం సింధు నగేష్, ఏపీవో నగేష్, ఈసీ అంకుష్, టెక్నికల్ అసిస్టెంట్ రాజలింగు, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు పాల్గొన్నారు.

# వీబీ-జీ రామ్ జీ పరిధిలో 375 పనులకు అనుమతిస్తూ నోటిఫై చేసిన గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీ?జీ రామ్ జీ) చట్టం?2025 పరిధిలో అనుమతించదగిన పనుల షెడ్యూల్‌ను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ నోటిఫై చేసింది. ఫలితంగా కొత్త గ్రామీణ పనుల విధివిధానాల పరిధిలోకి కొత్తగా 375 అనుమతించదగిన పనులు చేరాయి.

పాత విధానం పరిధిలో ఉన్న 266 పనులతో పోలిస్తే 41 శాతం విస్తరణను కొత్త షెడ్యూల్ సూచిస్తుంది. ఈ పనులను నీటి భద్రత, కీలకమైన గ్రామీన మౌలిక వసతులు, జీవనోపాధి సంబంధిత మౌలిక వసతులు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, విపత్తు సన్నద్ధత కోసం ప్రత్యేక పనులు అనే నాలుగు ప్రధాన విభాగాలుగా పునర్వ్యవస్థీకరించారు.

సంప్రదాయ ఆస్తుల కల్పనకు అతీతంగా వేతన ఉపాధిని శాశ్వత గ్రామీణ ఆస్తుల కల్పనతో, కొలవదగిన అభివృద్ధి ఫలితాలతో అనుసంధానించాలని కొత్త విధానం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి పనీ వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక ప్రకారం అట్టడుగు స్థాయి నుంచి వికేంద్రీకృత ప్రణాళికా ప్రక్రియ ద్వారా జరుగుతుంది. గ్రామసభ ఆమోదించిన ఈ పనులను వికసిత్ భారత్ నేషనల్ రూరల్ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్టాక్ ద్వారా పర్యవేక్షిస్తారు.

నాలుగు ప్రధాన విభాగాల్లోనూ అత్యధికంగా జల భద్రత విభాగంలోనే 128 పనులు ఉన్నాయి.

వీటిలో చెక్ డ్యాములు, గల్లీ ప్లగ్‌లు, భూగర్భ డైక్‌లు, రీఛార్జి షాఫ్టులు, ఇంజెక్షన్ బావులు, నదులు, కాల్వలు, నాలాల పునరుజ్జీవం, నీటితో నిండిన భూముల పునరుద్ధరణ, పంట భూములకు నీటిని సరఫరా చేసే కాలువల పునరుద్ధరణ లాంటివి ఉన్నాయి.

ఈ షెడ్యూల్లో నీటి సంరక్షణ, నీటి పారుదల కోసం బిందు సేద్యం, స్ప్రింక్లర్ వ్యవస్థలు, ఇంటి పై కప్పు నుంచి వర్షపు నీటి సేకరణ, కుంటలతో సహా మంచు స్థూపాలు, కృత్రిమ హిమానీనదాలు లాంటి నూతన చర్యల కేటాయింపులు ఈ షెడ్యూల్లో ఉన్నాయి.

కీలకమైన గ్రామీణ మౌలిక వసతుల కోసం 111 పనులు

గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన పౌర, సామాజిక మౌలిక వసతులను బలోపేతం చేయడమే లక్ష్యంగా 111 పనులు కీలకమైన గ్రామీణ మౌలిక వసతుల్లో భాగంగా ఉన్నాయి.

దీనిలో సోలార్ వీధి దీపాలు, వ్యర్థాల నుంచి సంపదను వెలికి తీసే రీసైక్లింగ్ కేంద్రాలు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, విభజన షెడ్లు, గ్రామీణ గ్రంథాలయాలు, పశు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, కామన్ సర్వీసు సెంటర్లు, మల్టీపర్పస్ యూత్ సెంటర్లు, సామాజిక సౌకర్యాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు ఉన్నాయి.

ఈ విధివిధానాల్లో జల్ జీవన్ మిషన్ నీటి సరఫరా మౌలిక సదుపాయాల మరమ్మతు, నిర్వహణతో పాటు, గ్రామీణ పార్కులు, కాలిబాటలు, గ్రామాల్లో ఇతర సౌకర్యాల కల్పనకు కూడా వీలు కల్పిస్తుంది.

గ్రామీణ జీవనోపాధిని, విలువ వ్యవస్థలను బలోపేతం చేయడానికి 98 పనులు

జీవనోపాధి సంబంధిత మౌలికవసతులకు కొత్త విధానం గణనీయమైన ప్రాధాన్యమిస్తుంది. దీనిలో 98 పనులకు అనుమతి ఉంది.

ఈ విభాగంలో వ్యవసాయ ఉత్పత్తుల శుద్ధి, విలువ జోడింపు మౌలిక వసతులు, క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకేజింగ్ యూనిట్లు, శీతల గిడ్డంగి సౌకర్యాలు, మినీ ఫ్లోర్ మిల్లులు, మార్కెట్ యార్డులు, డెయిరీ మౌలిక వసతులు, పుట్టగొడుగుల సాగు షెడ్లు, సెరీకల్చర్ షెడ్లు, పాలీ-హౌస్‌లు, ఆక్వాకల్చర్ వసతులు ఉన్నాయి.

స్వయం సహాయక బృందాలు, వాటి సమాఖ్యల కోసం ఎస్‌హెచ్‌జీ వర్క్‌షెడ్‌లు, షీ మార్ట్‌లు, సమాఖ్య భవనాలు, శిక్షణ-నైపుణ్యాభివృద్ధి కేంద్రాలతో సహా మౌలిక సదుపాయాలను కూడా అందిస్తుంది. పాత విధానం పరిధిలో నిర్దేశించిన 1.1 శాతంతో పోలిస్తే, కొత్త విధానం పరిధిలో మొత్తం అనుమతించదగిన పనుల్లో జీవనోపాధికి సంబంధించిన పనుల వాటా 26 శాతానికి గణనీయంగా పెరిగింది.

గ్రామీణ పనుల విధానంలో మొదటిసారిగా విపత్తు సన్నద్ధత, తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి 38 పనులతో కూడిన ఒక ప్రత్యేక విభాగాన్ని చేర్చారు.

వీటిలో వరద సహాయక శిబిరాలు, రిటైనింగ్ వాల్స్, కట్టల బలోపేతం, వరద రక్షణ పనులు, విపత్తు అనంతరం గ్రామీణ రహదారులు, సామాజిక ఆస్తుల పునరుద్ధరణ, ఫైర్ లైన్లు, ఫ్యూయల్-బఫర్ జోన్‌ల వంటి అటవీ అగ్నిప్రమాద నిర్వహణ చర్యలు ఉన్నాయి.

వరదలు, తుఫానులు, వడగళ్ల వానలు, కరువులు, కొండచరియలు విరిగిపడటం, అటవీ అగ్నిప్రమాదాలు, ఇతర తీవ్ర వాతావరణ సంఘటనల నుంచి గ్రామీణ సమాజాలను, ఆస్తులను రక్షించడమే ఈ విభాగం లక్ష్యం.

రైతులు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు, మహిళలు, గ్రామీణ యువతపై దృష్టి

వ్యవసాయం, బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలు, మహిళలు, గ్రామీణ యువతపై ఈ షెడ్యూల్ ప్రత్యేక దృష్టి సారిస్తుంది.

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 181 పనులు ఉండగా వాటిలో వ్యక్తిగత లబ్ధిదారుల పనులు 52 ఉన్నాయి. ఈ పనుల్లో నీరు, భూమి, మొక్కల పెంపకం, పశుసంపద, రైతులకు ప్రత్యక్ష తోడ్పాటును అందించే ఉత్పాదక ఆస్తులున్నాయి.

# ఈ-సంజీవని ద్వారా 50 కోట్లు దాటిన టెలికన్సల్టేషన్లు...

# దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవలు మరింత బలోపేతం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:భారత్ జాతీయ టెలిమెడిసిన్ సేవ ఈ-సంజీవని ద్వారా 50 కోట్ల (500 మిలియన్) టెలికన్సల్టేషన్లు (ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులు) పూర్తయ్యాయి. ఇది దేశవ్యాప్తంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత అందుబాటులోకి, తక్కువ ఖర్చుతో, సమానంగా అందించేందుకు డిజిటల్ సాంకేతికతను వినియోగించుకోవడంలో ప్రభుత్వ ప్రయత్నాల్లో చారిత్రాత్మక విజయంగా నిలిచింది.

2026 సెప్టెంబర్ 15న ఈ-సంజీవని 50 కోట్ల మార్కును దాటింది. దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి 50,00,92,730 టెలికన్సల్టేషన్లు నమోదయ్యాయి. దేశంలో ఇప్పటికే ఉన్న వైద్య సేవలకు టెలిమెడిసిన్ మరింతగా తోడ్పడుతున్న తీరును ఈ విజయం ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల, తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో నివసించే ప్రజలకు దూరం, భౌగోళిక పరిస్థితులు వంటి సమస్యలను అధిగమించడంలో ఇది ఉపయోగపడుతోంది.

ప్రాథమిక వైద్య సేవల్లో ప్రపంచంలోనే అతిపెద్ద టెలిమెడిసిన్ అమలుగా ఈ-సంజీవని భారత్ డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలో కీలక భాగంగా మారింది. ప్రజలు ఇంటి నుంచే వైద్య నిపుణులను సంప్రదించే అవకాశం కల్పించడం ద్వారా, సాధారణంగా ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల వరకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వ వైద్య సేవలను మరింత విస్తరించింది. ప్రజలు నివసించే ప్రాంతాలకు వైద్య సంప్రదింపులను చేరువ చేసింది.

ఈ సేవ ప్రారంభమైనప్పటి నుంచి వేగంగా, స్థిరంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం ఈ-సంజీవని ద్వారా 1.42 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలు, 19,473 మెడికల్ కేంద్రాలు, 901 ఆన్‌లైన్ ఓపీడీలు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవలో 2,41,923 మంది వైద్య సేవలందించేందుకు నమోదు చేసుకున్నారు. ఇంగ్లిషుతో పాటు 14 భారతీయ భాషలు కలిపి మొత్తం 15 భాషల్లో ఈ-సంజీవని సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 2.5 నుంచి 3 లక్షల టెలికన్సల్టేషన్లు జరుగుతున్నాయి. ఒక రోజు అత్యధికంగా 6,30,315 టెలికన్సల్టేషన్లు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా టెలిమెడిసిన్ సేవలకు ప్రజల ఆదరణ, వినియోగం పెరుగుతున్న తీరును ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆసుపత్రులు లేదా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేందుకు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావడం, ఎక్కువ సమయం కేటాయించడం లేదా ఇతర ఇబ్బందులు ఎదుర్కనే ప్రజలకు ఈ సేవల మరింత ఉపయోగకరంగా మారుతున్నట్లు ఈ సంజీవని వినియో వివరాలను పరిశీలిస్తే తెలుస్తోంది. మొత్తం వినియోగదారుల్లో మహిళల వాటా 57.14 శాతంగా ఉంది. 46 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న పౌరులు 40.15 శాతం ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులను పొందుతున్నారు. ఇందులో 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వృద్ధుల వాటా 16.25 శాతంగా ఉంది. మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఈ సేవను వినియోగిస్తుండటం వల్ల టెలిమెడిసిన్ ద్వారా వైద్య సేవలను మరింత సులభంగా, అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలకు ఇది తోడ్పడే అవకాశం ఉందని స్పష్టమవుతోంది.

టెలిమెడిసిన్ సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు కొత్త సాంకేతికతలను అనుసంధానిస్తూ ఈ-సంజీవని నిరంతరం అభివృద్ధి చెందుతోంది. ఇందులో భాగంగా ఇటీవల కృత్రిమ మేధ ఆధారిత క్లినికల్ నిర్ణయ సహాయక వ్యవస్థను (ఏఐ-సీడీఎస్ఎస్) అనుసంధానించారు. వైద్య సంప్రదింపుల సమయంలో ఆరోగ్య సేవలందించే సిబ్బందికి ఈ వ్యవస్థ సహాయపడుతుంది. వైద్యపరమైన నిర్ణయాలను మరింత నాణ్యంగా, ఒకే విధంగా, సమర్థవంతంగా తీసుకునేందుకు ఇది తోడ్పడుతుంది. ఈ సాంకేతికతకు 2026 జాతీయ ఈ-గవర్నెన్స్ అవార్డుల్లో గోల్డ్ అవార్డు లభించింది.

సమగ్ర వైద్య సేవలను మరింత బలోపేతం చేసేలా మరో కీలక చర్యగా.. ఈ-సంజీవనిని అత్యవసర స్పందన సహాయ వ్యవస్థ (ఈఆర్ఎస్ఎస్)-112తో కూడా అనుసంధానించారు. దీంతో అత్యవసర స్పందన సేవలు, దూర వైద్య నిపుణుల సహాయాన్ని మరింత సమర్థవంతంగా అనుసంధానించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయాన్ని మరింత సమన్వయంతో అందించడంతో పాటు, అత్యవసర ఆరోగ్య సేవల్లో డిజిటల్ సాంకేతికత వినియోగాన్ని మరింత బలోపేతం చేయడం ఈ అనుసంధానం లక్ష్యం. విస్తృతమైన ప్రాథమిక ఆరోగ్య సేవల వ్యవస్థను ఆధారంగా చేసుకుని ఈ-సంజీవని ఇప్పుడు ప్రాథమిక ఆరోగ్య సేవలకు మించి నిపుణుల వైద్య సంప్రదింపులను అందించే దిశగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థల ద్వారా ప్రత్యేక వైద్య విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్ ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఎయిమ్స్ జోధ్‌పూర్, ఎయిమ్స్ జమ్మూ, ఎయిమ్స్ పాట్నాలో ఎంపిక చేసిన వైద్య విభాగాల్లో రోగులు, వైద్యుల మధ్య ఆన్‌లైన్ వైద్య సంప్రదింపుల సేవలు ప్రారంభమయ్యాయి. దీంతో రోగులు తమ ఇళ్ల నుంచే నిపుణుల వైద్య సలహాలను పొందవచ్చు.

ఈ సేవల వల్ల రోగులు దూర ప్రాంతాల నుంచి ప్రయాణించి తృతీయ స్థాయి ఆసుపత్రుల్లో వైద్యుల కోసం ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుంది. అదే విధంగా నిపుణులైన వైద్యుల సేవలు మరింత మందికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. . ఈ సదుపాయాన్ని భవిష్యత్తులో ఎయిమ్స్ జిప్‌మెర్ (జేఐపీఎంఈఆర్), పీజీఐఎంఈఆర్ చండీగఢ్ వంటి ఇతర ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థలకు కూడా క్రమంగా విస్తరించనున్నారు. దీనివల్ల ఆసుపత్రుల్లో నేరుగా అందించే సాధారణ ఓపీ సేవలకు ఇది అదనపు సహాయంగా నిలవడంతో పాటు, రోగులకు నిరంతర వైద్య సేవలు అందేలా చేయడంలో దోహదపడుతుంది.

నిపుణుల ఆన్‌లైన్ వైద్య సంప్రదింపుల విస్తరణ ఈ-సంజీవని ప్రయాణంలో మరో కీలక ముందడుగు. తొలుత ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో వైద్య సంప్రదింపులను అందించిన ఈ-సంజీవని, ఇప్పుడు వివిధ స్థాయిల ఆరోగ్య సేవలను అనుసంధానించే దిశగా విస్తరిస్తోంది. దీని ద్వారా రోగులను వారికి అవసరమైన వైద్య నిపుణులతో అనుసంధానించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో అందుబాటులో ఉన్న నిపుణుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది.

ఈ-సంజీవని భారత్‌లోనే అభివృద్ధి చేసిన డిజిటల్ ఆరోగ్య సేవ. దీనిని అధునాతన కంప్యూటింగ్ అభివృద్ధి కేంద్రం (సీ-డీఏసీ) అభివృద్ధి చేసింది. ఈ-సంజీవని ప్రారంభమైనప్పటి నుంచి సీ-డీఏసీ మొహాలీ సంస్థ సాంకేతిక అభివృద్ధి, ఇంజినీరింగ్ సహా అన్ని దశల్లో సహకారం అందిస్తోంది. భారత ఆరోగ్య వ్యవస్థలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ-సంజీవనిని నిరంతరం అభివృద్ధి చేయడంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కీలక పాత్ర పోషిస్తోంది.

మంత్రిత్వ శాఖ, సాంకేతిక భాగస్వామ్య సంస్థల మధ్య కొనసాగుతున్న సహకారంతో పాటు నిరంతర సాంకేతిక ఆవిష్కరణల ఫలితంగా ఈ-సంజీవని తొలుత ఉన్న హబ్-అండ్-స్పోక్ టెలిమెడిసిన్ విధానం నుంచి దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు సేవలందించే డిజిటల్ ఆరోగ్య వేదికగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం ఈ వేదిక ద్వారా 50 కోట్ల ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులు పూర్తయ్యాయి. భారీ స్థాయిలో ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను అందించేందుకు దేశీయంగా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను రూపొందించడంలో, అమలు చేయడంలో పెరుగుతున్న భారత్ సామర్థ్యాన్ని ఈ-సంజీవని అభివృద్ధి, విస్తరణ ప్రతిబింబిస్తుంది. ఇది ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికి, వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఉంది.

ఈ-సంజీవని ద్వారా 50 కోట్ల ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులు పూర్తవడం భారత్ డిజిటల్ ఆరోగ్య ప్రయాణంలో కీలక ప్రస్థానంగా నిలిచింది. దేశ ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో సాంకేతికత పాత్ర పెరుగుతోందనడానికి ఇది నిదర్శనం. ప్రాథమిక వైద్య సేవలతో పాటు నిపుణుల వైద్య సేవలను కూడా అందించేలా ఈ-సంజీవని విస్తరిస్తోంది. కృత్రిమ మేధ, అత్యవసర స్పందన సేవలతో అనుసంధానం చేయడంతో పాటు ప్రముఖ తృతీయ స్థాయి ప్రభుత్వ వైద్య సంస్థలకు కూడా సేవలను విస్తరిస్తోంది. దీంతో అందరికీ సులభంగా, సమానంగా వైద్య సేవలు అందేలా చేయడంలో ఈ-సంజీవని కీలకంగా మారుతోంది.

ఈ-సంజీవనిని నిరంతరం అభివృద్ధి చేయడం ద్వారా డిజిటల్ ప్రజా మౌలిక వసతులు, దేశీయ సాంకేతిక సామర్థ్యాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వ నిబద్ధత స్పష్టమవుతోంది. భౌగోళిక అడ్డంకులను తగ్గించడం, రోగులకు వివిధ స్థాయిల్లో నిరంతర వైద్య సేవలు అందేలా చూడటం, ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుబాటులో ఉండే సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడం ఈ వేదిక ఉద్దేశం. దేశవ్యాప్తంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో ఈ-సంజీవని కీలక పాత్ర పోషిస్తోంది.

## కమిషనరేట్ వ్యాప్తంగా విస్తృత తనిఖీలు.. అర్ధరాత్రి నాకాబందీ

కరీంనగర్, అక్టోబర్ 8:నేరాల నియంత్రణతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు బుధవారం అర్ధరాత్రి ఏకకాలంలో నాకాబందీ నిర్వహించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, హుజూరాబాద్ డివిజన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లు, ప్రవేశ?నిష్క్రమణ మార్గాలు, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు ఏసీపీలు, 15 మంది సీఐలు, 27 మంది ఎస్సైలు, 54 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 130 మంది కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ విభాగానికి చెందిన ఆరుగురు సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్ పరిధిలో ఎన్టీఆర్ జంక్షన్, బోట్ జంక్షన్, బస్టాండ్, గీతాభవన్ సెంటర్, పద్మానగర్ జంక్షన్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ రూరల్ పరిధిలో బొమ్మకల్, తీగలగుట్టపల్లి, రేకుర్తి, అలుగునూర్, చింతకుంట, మానకొండూర్, గంగాధర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు . హుజూరాబాద్ డివిజన్‌లో హుజూరాబాద్, పరకాల క్రాస్ రోడ్, కేశవపట్నం, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక తదితర ప్రాంతాల్లో ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు.

తనిఖీల సందర్భంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలతో పాటు అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలను ఆపి పరిశీలించారు. వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అక్రమ రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఇలాంటి ఆకస్మిక తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. వాహనదారులు తమ వెంట చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. పోలీసుల తనిఖీలకు ప్రజలు సహకరించాలని సీపీ కోరారు.

# కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయ్

### మంథని-కాటారం ప్రధాన రహదారిపై ఎక్లాస్పూర్ రైతుల రాస్తారోకో



కరీంనగర్, అక్టోబర్ 8:మంథని మండలం ఎక్లాస్పూర్ గ్రామంలో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. కరెంటు లేక వరి పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో ఆగ్రహించిన రైతులు గురువారం మంథని?కాటారం ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రహదారిపై బైఠాయించి రాకపోకలను నిలిపివేశారు. దీంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత 20 రోజులుగా సరైన వర్షం లేక బోర్లే ఆధారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే త్రీఫేస్ కరెంటు కేవలం మూడు గంటలు మాత్రమే ఇస్తున్నారని, అది కూడా లో-వోల్టేజీతో రావడంతో మోటార్లు కాలిపోతున్నాయని వాపోయారు. ఎక్లాస్పూర్ పరిధిలో సుమారు 500 ఎకరాల్లో వరి, పత్తి పంటలు పొట్ట దశలో ఉన్నాయని, ఇప్పుడు నీరు అందకపోతే పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ, మంథని పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. రేపటి నుంచి కరెంటు సరఫరా సమయాన్ని పెంచుతామని, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే బాగు చేస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ధర్నాలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గువ్వల రాజుతో పాటు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లంచగొండి అధికారులపై సస్పెన్షన్ వేటు

### సీఐ, ఎస్ఐ సహా కానిస్టేబుల్ పై చర్యలు-ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ



కరీంనగర్, అక్టోబర్ 8:లంచగొండి పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. జేసీబీ వదిలేందుకు లంచం అడిగారనే ఆరోపణలతో ఇప్పటికే బదిలీ చేయబడిన సీఐ, ఎస్ఐ సహా కానిస్టేబుల్ పై ఆరోపణలు రుజువు కావడంతో బుధవారం రాత్రి సస్పెన్షన్ వేటు వేశారు. మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ కమిషన రేట్ పరిధిలోని తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, ఎస్సై అన్వర్ లతోపాటు ఒక కానిస్టేబుల్ ను ఏఆర్ హెడ్ క్వార్టర్ విభాగానికి అటాచ్ చేస్తూ కరీంనగర్ సిపి ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.. వివరాల్లోకెలితే తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన బాబు అనే వ్యక్తి జేసీబీ, ట్రాక్టర్ వాహనాలు రిలీజ్ చేయాలంటే రూ.లక్ష ఇవ్వాలని సీఐ బొల్లం రమేశ్, ఎల్ఎండీ ఎస్సై అన్వర్ డిమాండ్ చేశారు.

అయితే రూ.50 వేలు ఇచ్చేందుకు బాబు అంగీకరించాడు. ఈ క్రమంలో మొదట రూ.30 వేల నగదు ఇచ్చాడు. మరో రూ.20 వేలు పోలీసులు సూచించిన తిమ్మాపూర్ లోని విఘ్నేశ్వర వైన్స్ నిర్వాహకులకు ఫోన్ పే చేశాడు. ఆ మొత్తాన్ని సీఐ, ఎస్సైలు ఒక కానిస్టేబుల్ ద్వారా తెప్పించుకున్నారు. మరోవైపు బాబు వాహనాల విడుదల కోసం ప్రభుత్వానికి చలానా రూపంలో జరిమానా కట్టాడు. ట్రాక్టర్లకు రూ.5 వేల చొప్పున రూ.15 వేలు, జేసీబీకి రూ.10 వేలు డీడీ వేర్వేరుగా చెల్లించాడు. దీంతో ఈ వాహనాలను రిలీజ్ చేస్తున్నట్లు తిమ్మాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రిలీజ్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో బాబు ఆ ఆర్డర్ తీసుకుని వాహనాలు తీసు కెళ్లడానికి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ కు వెళ్లగా ఆ డబ్బులు సరిపోవని అదనంగా చెల్లించాలని చెప్పడంతో యజమాని బాబు ఖంగుతిన్నాడు.

రిలీజ్ ఆర్డర్ వచ్చాక.. వాహనాలు ఇవ్వకుండా తిమ్మాపూర్ సీఐ రమేశ్, ఎల్ఎండీ ఎస్సై అన్వర్ రూ. లక్ష ఇవ్వాలని అడిగినట్లు చెప్పాడు. లేదంటే వాహనాలను కోర్టుకు అప్పగిస్తామని బెదిరించారని మీడియా ఎదుట వాపోయాడు. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడంతో విచారణ జరిపిన పోలీసు బాస్ ముగ్గురిని హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మిన్ డిసిపి తో పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక తెప్పించుకున్నారు. ఆరోపణలు రుజువు కావడంతో వీరిపై సస్పెన్షన్ వేటు క వేస్తూ ఐజి ఉత్తర్వులు జారీ చేయడం జిల్లాలో సంచలనంగా మారింది.

# ‘కలం కవాతు’ పుస్తకావిష్కరణ




నల్గొండ, అక్టోబర్ 8:మాజీ విద్యార్థి నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, అడ్వకేట్ కట్టెల లింగస్వామి రచించిన ‘కలం కవాతు’ పుస్తకావిష్కరణ కార్యక్రమం పాత నవోదయ సినిమా హాల్‌లోని బి.ఆర్.కె. కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఘనంగా జరిగింది. తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసిం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పలు కీలక అంశాలను అక్షర రూపంలోకి తెచ్చి అద్భుతమైన పుస్తకాన్ని అందించిన కట్టెల లింగస్వామిని అభినందించారు. పోరాట నేపథ్యం ఉన్న సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ ప్రాంతాలు తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించాయని, నేడు సాహిత్యంలోనూ మొదటి అడుగు వేయడం హర్షణీయమన్నారు. కవి తన అనుభవాలతో పాటు ప్రజల జీవన విధానాన్ని పుస్తకంలో చక్కగా ఆవిష్కరించారని కొనియాడారు. విద్యార్థిగా, అధ్యాపకుడిగా, రచయితగా లింగస్వామి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ స్థానిక నిరుద్యోగం, కాలుష్య సమస్యలపై విద్యార్థులు, యువత స్పందించి చైతన్యవంతమయ్యేలా సాహిత్యం రావాలన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుడిగా పనిచేసి, నేడు అధ్యాపకుడిగా, రచయితగా సమాజహితం కోసం పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. దేశంలో జరుగుతున్న వివిధ ఉద్యమాలకు ఇలాంటి పుస్తకాలు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు, మిత్రులు రచయిత కట్టెల లింగస్వామిని ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు బచ్చనగోని గాలయ్య, జిల్లా యాదయ్య, బోరం ప్రకాష్‌రెడ్డి, తాడూరి పరమేష్, బాతరాజు సత్యం, బోయ రామచంద్రం, లింగస్వామి, మల్లేష్, చిలకరాజు రాజు, సంజీవ, కొండూరు వెంకటేశం, తిగుళ్ల శ్రీనివాస్, కార్తీక్ గౌడ్, చింతల సాయిలు, ఎండీ ఖయ్యూం, తడక మోహన్, కాకి సుందర్, విష్ణుకుమార్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డితో పాటు పలు కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

నల్గొండ, అక్టోబర్ 8: మండలంలోని తిరుమలాపూర్‌కు చెందిన బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పలువురు బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపగాని స్వామి, నాయకులు కంచర్ల శ్రీనివాస్, గోలకొండ విజేందర్, బీఆర్ఎస్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపగాని శివరాములు, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు ఎలగొండ శంకర్, చెన్నమల్ల మొగిలి, బీసీ సెల్ నాయకులు ఆరెల్లి సంతోష్, అనుముల రవి, గజ్జి నరేష్ తదితరులు ఉన్నారు.

## కాలుష్యంతో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

నల్గొండ, అక్టోబర్ 8:: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని దండు మల్కాపురం, ఎల్లగిరి, అంతమ్మగూడెం, దోతిగూడెం తదితర గ్రామాల్లో పరిశ్రమల రసాయన వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమై పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం వివిధ శాఖలకు చెందిన అధికారుల బృందం ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించింది. దండు మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో పరిశ్రమల సమీపంలో ఉన్న పంట పొలాలను అధికారులు నిశితంగా పరిశీలించి వివరాలను సేకరించారు.

కలుషిత నీటి కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయామని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిశ్రమల యాజమాన్యాల నుంచి ఎకరాకు రూ.60 వేల చొప్పున నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## కొత్తపల్లి రాజారంలో తీవ్ర ఉద్రిక్తత

ఆదిలాబాద్, అక్టోబర్ 8: కోటపల్లి మండలంలోని కావర కొత్తపల్లి రాజారం గ్రామంలో బుధవారం ఉద్రిక్తత నెలకొంది. అటవీ భూమిలో పట్టుపురుగుల సాగు చేసుకుంటున్న గిరిజనులపై అటవీశాఖ అధికారులు దాడి చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఘటనలో చింతల లస్మయ్య అనే గిరిజనుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే స్పృహ కోల్పోయినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారుల దాడిలో గాయపడిన చింతల లస్మయ్యను స్థానికులు వెంటనే చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజన సంఘాలు, గ్రామస్తులు ఆరోపించారు. సాగు చేసుకుంటున్న భూముల విషయంలో తమపై దాడులు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గిరిజనులపై దాడికి పాల్పడిన అటవీశాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని గిరిజనులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) చట్టం కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై అధికారులు స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.



# ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌లో ఏఐకోశ్ యూనివర్సిటీ భాగస్వామ్య కార్యక్రమం ద్వారా విద్యారంగ భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తున్న ఇండియాఏఐ మిషన్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియాఏఐ మిషన్... 2026 అక్టోబర్ 5న ఆంధ్రప్రదేశ్, తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏఐకోశ్ యూనివర్సిటీ భాగస్వామ్య కార్యక్రమం (యూఈపీని) నిర్వహించింది. ఏఐపై అవగాహనను బలోపేతం చేయడం, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ వ్యవస్థలో భాగస్వామ్యానికి అవసరమైన జ్ఞానం, సాధనాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యాలు.

మార్చి 2024లో భారత ప్రభుత్వం ఆమోదించిన 'ఇండియాఏఐ మిషన్'... ఆవిష్కరణలను ప్రోత్సహించడం, బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి వీలు కల్పించడం, స్వదేశీ ఏఐ సామర్థ్యాలను బలోపేతం చేయడం, ఏఐ ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చూడటం ద్వారా కృత్రిమ మేధ రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదగాలన్న భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళుతోంది.

మిషన్ కీలక స్తంభమైన ఏఐకోశ్... భారత ఏకీకృత డేటా ప్లాట్‌ఫారమ్‌గా పనిచేస్తుంది. ఇది పరిశోధన, ఏఐ అప్లికేషన్ అభివృద్ధికి తోడ్పడే అధిక-నాణ్యత గల డేటాసెట్‌లు, ఏఐ మోడల్‌లు, టూల్‌కిట్‌లు, బెంచ్‌మార్క్‌లు, ఇతర కీలక వనరులను అందుబాటులో ఉంచుతుంది. ఏఐకోశ్ యూనివర్సిటీ భాగస్వామ్య కార్యక్రమం ద్వారా విద్యార్థులకు, విద్యాసంస్థలకు ఈ జాతీయ ఏఐ అసెట్‌లను పరిచయం చేయడంతో పాటు... ఆచరణాత్మక అభ్యాసాన్ని, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఇండియాఏఐ మిషన్ లక్ష్యం.

ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 160 మందికి పైగా విద్యార్థులు... నిపుణుల సెషన్లు, ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్రయోగాత్మక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఏఐకోశ్, విస్తృతమైన ఇండియాఏఐ వ్యవస్థ గురించి వారికి అవగాహన కల్పించేలా ఈ కార్యకలాపాలను రూపొందించారు. దీనిలో పాల్గొన్న విద్యార్థులు ఏఐకోశ్ ఎంసీపీ (మోడల్ కాంటెక్స్ట్ ప్రోటోకాల్), ఏఐకోశ్ ఎస్‌డీకే (సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కిట్)లనూ పరిశీలించారు. ఇవి వినియోగదారులు సహజ భాషను ఉపయోగించి డేటాసెట్‌లు, ఏఐ మోడళ్లను కనుగొనడానికి వీలు కల్పిస్తాయి. జాతీయ ఏఐ వనరులను పొందడాన్ని సులభతరం చేయడంతో పాటు డెవలపర్లకు, డెవలపర్లు కాని వారికి ఉన్న అడ్డంకులనూ తగ్గిస్తాయి.

ఈ కార్యక్రమం గురించి ఇండియాఏఐ మిషన్ డైరెక్టర్ శ్రీ మహమ్మద్ వై. సఫీరుల్లా మాట్లాడుతూ, "ఏఐని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న మన గౌరవ ప్రధానమంత్రి దార్శనికతతో... ఇండియాఏఐ మిషన్ ఈ నిబద్ధతను దేశవ్యాప్తంగా ఉన్న క్యాంపస్‌లకు తీసుకువెళ్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో... మా పనికి మూలస్తంభాలైన 'ప్రజలు, ప్లానెట్, పురోగతి' అనే మూడు సూత్రాలు, భారత ఏఐ వ్యవస్థతో మమేకమవ్వడానికి సిద్ధంగా ఉన్న కొత్త తరం విద్యార్థుల ద్వారా జీవం పోసుకోవడాన్ని మేం చూస్తున్నాం. ఏఐకోశ్ యూనివర్సిటీ భాగస్వామ్య కార్యక్రమం ద్వారానే మేం ఆ దార్శనికతను ఒక స్పష్టమైన రూపంలోకి తీసుకువస్తున్నాం. భారత ఏఐ ప్రయాణానికి విద్యార్థులు తమ వంతు సహకారం అందించడానికి వీలుగా నిజమైన డేటాసెట్‌లు, నిజమైన మోడల్‌లు, నిజమైన అవకాశాలనూ అందిస్తున్నాం" అని అన్నారు.

ఈ సహకారాన్ని స్వాగతిస్తూ, ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. కృష్ణారావు ఇలా అన్నారు - "ఏఐకోశ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా 'భారత్‌జెన్' వంటి ప్రాథమిక ప్రయత్నాల ఆధారంగా దేశం కోసం జ్ఞానాన్ని పంచుకునే ఒక శక్తిమంతమైన వ్యవస్థను మేం రూపొందిస్తున్నాం. ప్రపంచ స్థాయి ఏఐ పోటీలో ముందంజలో ఉండటానికి, దేశంలో సానుకూల అభివృద్ధిని సాధించేలా ఏఐని సమర్థంగా వినియోగించుకోవడానికి ఏఐకోశ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు అత్యంత ఆవశ్యకం."

ఏఐకోశ్ యూనివర్సిటీ భాగస్వామ్య కార్యక్రమం తదుపరి దశలో భాగంగా... ఏఐకోశ్ ఓపెన్-సోర్స్ కమ్యూనిటీ, ఏఐకోశ్‌లోని ఈ సంస్థ గురించిన సంస్థాగత ప్రొఫైల్ ద్వారా డేటాసెట్‌లను అందించడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తారు. ఇప్పటికే ఉన్న డేటాసెట్‌లను మెరుగుపరచడానికి, ప్రజా ప్రయోజన వినియోగ సందర్భాలను పరిష్కరించే ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్ ఏఐ అప్లికేషన్‌లను అభివృద్ధి చేయడానికీ వారిని ప్రోత్సహిస్తారు. విద్యార్థుల నేతృత్వంలోని అత్యుత్తమ కృషిని భవిష్యత్ గుర్తింపు కోసం పరిగణించవచ్చు. ఏఐ అవగాహన, డేటాసెట్ అన్వేషణ నుంచి ఆవిష్కరణలు, వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారం దిశగా ఒక మార్గాన్ని ఇది సృష్టిస్తుంది.

ఏఐకోశ్ యూనివర్సిటీ భాగస్వామ్య కార్యక్రమం... విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు భారత జాతీయ ఏఐ మౌలిక సదుపాయాలను పరిచయం చేయడం ద్వారా ఉన్నత విద్యాసంస్థల్లో ఏఐ వినియోగాన్ని మరింతగా పెంచడానికి రూపొందించిన దేశవ్యాప్త కార్యక్రమం. ఏఐకోశ్ ప్రస్తుతం 16,000కు పైగా డేటాసెట్‌లు, 350కు పైగా ఏఐ మోడల్‌లు, 200కు పైగా వినియోగ సందర్భాలనూ కలిగి ఉంది. పరిశోధకులు, అంకురసంస్థలు, డెవలపర్‌లు, విద్యార్థులు విశ్వసనీయమైన జాతీయ వనరులను ఉపయోగించి ఏఐ పరిష్కారాలను రూపొందించడానికి ఇది వీలు కల్పిస్తుంది.ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం శక్తిమంతమైన ఏఐ-సంసిద్ధత గల ప్రతిభావంతుల సమూహాన్ని నిర్మించడంలోనూ... దేశం కోసం సమ్మిళిత, బాధ్యతాయుత, ఆవిష్కరణ-ఆధారిత ఏఐ వ్యవస్థను సృష్టించాలన్న ఇండియాఏఐ మిషన్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలోనూ కీలక ముందడుగు అవుతుంది. ఏఐకోశ్ యూనివర్సిటీ భాగస్వామ్య కార్యక్రమం ద్వారా, ఈ మిషన్ దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ... డేటాసెట్‌లు, మోడల్‌లు, అప్లికేషన్‌లు, పరిశోధన, బాధ్యతాయుతమైన ఏఐ స్వీకరణకు దోహదపడే క్యాంపస్-స్థాయి ఏఐ కమ్యూనిటీలను ప్రోత్సహిస్తుంది.

## భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో బంగారం స్మగ్లింగ్‌పై డీఆర్ఐ చర్యలు 8.3 కేజీలకుపైగా విదేశీ బంగారం స్వాధీనం, నలుగురు అరెస్టు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:బంగారం అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చర్యలు చేపట్టింది. నిఘా వర్గాల సమాచారంతో భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంట డీఆర్ఐ అధికారులు చేపట్టిన దాడిలో సుమారు 12.37 కోట్ల విలువైన 8.3 కేజీల విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లింగ్‌కు పాల్పడిన నలుగురిని అరెస్టు చేశారు.

ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంట కూచ్ బెహార్ జిల్లాలో డీఆర్ఐ అధికారులు నిఘా పెట్టారు. 05.10.2026న భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో చౌధురిహాట్ వద్ద కూచ్ బెహార్ వైపు రెండు బైక్‌లపై వస్తున్న నలుగురు వ్యక్తులను అడ్డగించారు. వారిని తనిఖీ చేయగా బంగారం బిస్కెట్లు లభించాయి. వస్త్రంతో ప్రత్యేకంగా కుట్టిన నడుము బెల్ట్ ధరించిన ఇద్దరు వ్యక్తుల వద్ద ఈ బంగారాన్ని గుర్తించారు.

నలుగురు నిందితుల నుంచి మొత్తం 72 బంగారం బిస్కెట్లు స్వాధీనం చేసుకోగా, అవి ఒక్కొక్కటి 116 గ్రాములు ఉన్నాయి. మొత్తంగా 8.3 కేజీల బరువున్న ఆ విదేశీ బంగారం విలువ దాదాపు 12.37 కోట్లు. కస్టమ్స్ చట్టం-1962లోని నిబంధనల ప్రకారం బంగారాన్ని సీజ్ చేసి, నలుగురు నిందితులను అధికారులు అరెస్టు చేశారు. తదుపరి దర్యాప్తును చేపట్టారు.

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంట కూచ్ బెహార్ జిల్లాలో సుదీర్ఘకాలంగా నిఘా ఏర్పాటు చేసి, డీఆర్ఐ అధికారులు ఈ దాడులను చేపట్టారు. సరిహద్దు ప్రాంతాల ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను నియంత్రించేందుకు డీఆర్ఐ చర్యలు తీసుకుంటోంది. అక్రమంగా బంగారం తరలింపు, రవాణా వెనకున్న సిండికేట్లను గుర్తించటంపై దృష్టి సారిస్తోంది.

# కస్తూర్బా పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## పరిశుభ్రత, హాజరు నమోదులో లోపాలపై ఆగ్రహం.. పది రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశం



నిజామాబాద్, అక్టోబర్ 8: నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్‌రూమ్, తరగతి గదులను పరిశీలించారు.

పాఠశాల పరిసరాలు పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల ఆరోగ్యానికి ఇబ్బందులు తలెత్తితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సిబ్బంది, విద్యార్థినుల హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్.. ఎఫ్ఆర్ఎస్ విధానం అమలుపై ఆరా తీశారు. హాజరు నమోదులో తేడాలు గుర్తించి ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

హాజరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. మూత్రశాలలు, ఫ్లోరింగ్ తదితర మౌలిక సదుపాయాల పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పనులను వెంటనే చేపట్టి నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో ఆహార పదార్థాల నాణ్యత, మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న ఆర్ఓ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని, సాధ్యం కాకపోతే కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. పది రోజుల తర్వాత తిరిగి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటిలోగా అన్ని లోటుపాట్లను సరిచేయాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను మండల అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ బి. రవీందర్‌రావు, ఎంపీడీవో మహ్మద్ ఆరీఫ్ అహ్మద్, ఎంఈవో రాములు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులు ఉన్నారు.

# మొదటి స్వదేశీ ఫ్లీట్ సపోర్ట్ ఓడ 'ఐఎన్ఎస్ సూర్య'ను విశాఖపట్నం హిందుస్తాన్ షిప్‌యార్డ్‌లో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:మొదటి ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్ఎస్-1)ను కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ విశాఖపట్నంలోని హిందుస్తాన్ షిప్‌యార్డ్ (హెచ్ఎస్ఎల్)లో ఈ రోజు ప్రారంభించారు. ఎఫ్ఎస్ఎస్-5 నిర్మాణ పనులకు ఆయన శుభారంభం చేశారు. ఉన్నతీకరించిన స్లిప్‌వే-4 (పడవలను నీటిలోకి దింపే మార్గం)తో పాటు, 300 టన్నుల సామర్థ్యం కలిగిన బరువులెత్తే యంత్రం గోలియత్ క్రేనును కూడా మంత్రి ప్రారంభించారు. ఈ పరిణామాలు పెద్దవైన, జటిలమైన నౌకలను నిర్మించడానికి హెచ్ఎస్ఎల్‌కు ఉన్న సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే కాక భారత స్వదేశీ నౌకావాణిజ్య శక్తియుక్తులను పెంచే దిశగా కూడా ఓ ముఖ్య ముందడుగును సూచిస్తున్నాయి.

సభను ఉద్దేశించి రక్షణ మంత్రి ప్రసంగిస్తూ, ఈ మూడు ప్రధాన విజయాలూ వ్యక్తిగత విజయాల కన్న మించినవిగా వర్ణించారు. "ఎఫ్ఎస్ఎస్1కు శ్రీకారం చుట్టడం ఓ విజయ ప్రస్థానం. ఎఫ్ఎస్ఎస్5కు కీల్ లేయింగ్ మన సంకల్పాన్ని చాటుతోంది. పడవలను నీటిలోకి దింపే కొత్త మార్గ నిర్మాణం మన సత్తా అంతకంతకూ పెరుగుతోందనడానికి నిదర్శనం" అని ఆయన వివరించారు. హెచ్ఎస్ఎల్ తన నౌకానిర్మాణ సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, భారతదేశ నౌకావాణిజ్య శక్తి పునాదులను కూడా పటిష్ఠ పరుస్తోందని మంత్రి అన్నారు.

స్వతంత్ర భారతదేశంలో 1948లో మొదటి ఓడ 'జల ఉష'ను 1948లో ప్రారంభించుకున్న సంగతిని కేంద్ర రక్షణ మంత్రి గుర్తు చేస్తూ, సముద్ర వారసత్వాన్ని భారత్ శతాబ్దాల నాటి నుంచే పరిరక్షించుకుంటూ వచ్చిందన్నారు. ప్రాచీన కాలం నుంచీ మన దేశం సముద్రాలతో తన అనుబంధాన్ని పెంచుకొంటూ వచ్చిందని ఆయన అన్నారు. భారత జాతీయ నౌకావాణిజ్య సామర్థ్యానికి సంరక్షకురాలి పాత్రను హెచ్ఎస్ఎల్ పోషిస్తోందనీ, ఎనిమిది కన్న ఎక్కువ దశాబ్దాల నుంచి దేశ నౌకావాణిజ్య, రక్షణ సంబంధ అవసరాలను తీర్చడంలో ఈ సంస్థ గొప్ప తోడ్పాటును అందిస్తోందన్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ అధీనంలోకి హెచ్ఎస్ఎల్ వచ్చిన తరువాత, 2025లో మినీరత్న కేటగిరీ-ఎ స్థాయిని అందుకున్న విషయాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. ఇది ఈ సంస్థ ప్రగతినీ, నిరంతర కృషినీ చాటుతోందని ఆయన అన్నారు.

ఫ్లీట్ సపోర్ట్ షిప్ కార్యక్రమాన్ని గురించి రక్షణ మంత్రి చెబుతూ, ఈ నౌకలు హిందూ మహాసముద్ర ప్రాంతంలో నౌకాదళ విస్తృతినీ, సామర్థ్యాన్నీ, కార్యకలాపాల పరంగా దక్షతనీ బలోపేతం చేస్తాయన్నారు. సముద్రాల్లో దూర ప్రాంతాల్లో దీర్ఘకాలం పాటు కార్యకలాపాలను నిర్వహించే నౌకాదళానికి ఒక్క యుద్ధనౌకల అవసరం మాత్రమే ఉండదనీ, ఆధునిక రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్), నిర్వహణ, నిరంతర సహాయం, కార్యకలాపాలను కొనసాగించగలగడం వంటి అవసరాలు కూడా నౌకాదళానికి ఉంటాయనీ మంత్రి వివరించారు. ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు సముద్రాల్లో రక్షణ కార్యకలాపాలకూ, నౌకాదళ దాడులకూ నిరంతర మద్దతును అందిస్తూ ఈ అవసరాలను తీరుస్తాయని ఆయన తెలిపారు. ఎఫ్ఎస్ఎస్-1 ప్రారంభం నౌకాదళ దాడుల విస్తృతినీ, సామర్థ్యాన్నీ పెంచే దిశగా ఓ కీలక ఘట్టమనీ, ఇక ఎఫ్ఎస్ఎస్-5 కు శంకుస్థాపన భారత దేశ నౌకావాణిజ్య భవిష్యత్తుకు బలమైన పునాదిని అందించగలదనీ మంత్రి అన్నారు.

నేవీ వైవ్స్ వెల్‌నెస్ అసోసియేషన్ (ఎన్‌డబ్ల్యూడబ్ల్యూఏ) అధ్యక్షురాలు శ్రీమతి లైలా స్వామినాథన్ సాంప్రదాయిక లాంఛనాలను పూర్తి చేసిన తరువాత, ఎఫ్ఎస్ఎస్-1ను



ప్రారంభించారు. ఎఫ్ఎస్ఎస్-1కు 'సూర్య' అనే పేరును పెట్టారు. ఆహ్వానితుల హర్షధ్వానాల మధ్య ఈ నౌకను బంగాళా ఖాతం జలాల్లో ప్రవేశపెట్టారు. ఈ నౌకకు రూపురేఖలను దిద్దడమే కాకుండా దీనిని హెచ్ఎస్ఎల్ నిర్మించింది. ఓడసరుకుతో పాటు ద్రవ రూప పదార్థాలను తీసుకువెళ్లే సామర్థ్యాన్ని 'సూర్య'కు జతపరిచారు. ప్రథమ శ్రేణికి చెందిన నిర్వహణ కార్యశాలలు, అనేక పనులను చేసిపెట్టగల హెలీకాప్టర్ దిగడానికి వీలుగా ఓడ పైభాగాన్నీ (డెక్), స్వీయ రక్షణ వ్యవస్థల్నీ జోడించారు.

ఉన్నతీకరించిన స్లిప్‌వే-4 పరిధిని విస్తరించడంతో పాటు పటిష్ఠపరిచారు. దీని ద్వారా 45,000 వరకు డీడబ్ల్యూటీ (డెడ్‌వెయిట్ టన్నేజి) గరిష్ఠంగా మోసుకుపోగలిగే నౌకల నిర్మాణంతో పాటు ఆ నౌకలను సముద్ర జలాల్లోకి పంపించే పనిని హిందుస్తాన్ షిప్‌యార్డు పూర్తి చేయగలుగుతుంది. 3వ, 4వ స్లిప్‌వేలను కలిపే 300 టన్నుల గోలియత్ క్రేన్ రూపకల్పన, నిర్మాణ బాధ్యతను మేక్ ఇన్ ఇండియాలో భాగంగా మెసర్స్ ఎల్ అండ్ టీ జియోస్ట్రక్చర్, కోనేక్రేన్స్ స్వీకరించి, నెరవేర్చాయి. దీనిలో పీఎల్‌సీ నియంత్రణలు, వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్స్, టాండెమ్ లిఫ్టింగ్, రిమోట్ డయగ్నోస్టిక్స్, కండిషన్ మానిటరింగ్ సాధనాలను అమర్చారు. వీటి సాయంతో భారీ బ్లాకులను వేగంగానూ, మరింత కచ్చితత్వంతోనూ తీసుకుపోవడం సాధ్యపడుతుంది. ఈ కొత్త సదుపాయం హిందుస్తాన్ షిప్‌యార్డుకు పెద్ద, సంక్లిష్టతర నౌకానిర్మాణ బాధ్యతలను నెరవేర్చడంతో పాటు ఆధునిక బ్లాక్ నిర్మాణ సామర్థ్యాన్ని అందిస్తుంది.

"స్వయంసమృద్ధి ఒక ప్రధాన విజయసూచిక. అయితే ప్రపంచంతో పోటీ పడే తత్వం దీని తరువాతి కీలక దశ" అని రక్షణ మంత్రి వర్ణించారు. నాణ్యత, ఖర్చు, సాంకేతిక విజ్ఞానం, సమయానికి నిర్మాణ పనులను పూర్తి చేయడం, విశ్వసనీయ పనితనం అంశాల్లో ప్రపంచంలో అగ్రగామి నౌకానిర్మాణ కంపెనీలతో భారతీయ నౌకానిర్మాణ కేంద్రాలు పోటీపడగలగాలని ఆయన స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో విశాల పారిశ్రామిక విస్తారిత అనుబంధ వ్యవస్థతో హెచ్ఎస్ఎల్ మరింత ఎక్కువగా మమేకం కావాలని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కోరారు. రాష్ట్రంలో సూక్ష్మ చిన్న మధ్యతరహా వాణిజ్య వ్యవస్థ (ఎమ్ఎస్ఎమ్ఈ)లు సరఫరాదారుల పాత్రను పోషించవచ్చునీ, విశ్వవిద్యాలయాలు పరిశోధనలకీ, నైపుణ్యాభివృద్ధికీ తోడ్పాటును అందించవచ్చునీ, సాంకేతిక వాణిజ్య సంస్థలు డిజిటల్ నౌకానిర్మాణంలో సహాయాన్ని అందించవచ్చునీ, అంకుర సంస్థలు నౌకావాణిజ్య సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయవచ్చునీ ఆయన వివరించారు.

## నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టాలి

నిజామాబాద్, అక్టోబర్ 8: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం లోని భీమ్‌గల్ మండలం సంతోష్‌నగర్ తాండ గ్రామంలో మహిళా గ్రామ సంఘం భవన నిర్మాణానికి ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ గురువారం భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ సంఘ భవనాల నిర్మాణ పనులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జరిగేవని, ప్రస్తుతం ఎః-ఉఖీంఓ-ఉ టెక్నికల్ సిబ్బంది పర్యవేక్షణలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ పనులను ఎంపీడీవో పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామంలో ఇంకుడు గుంతలు, ఫారం పాండ్‌ల పనులను అధిక సంఖ్యలో ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలని సూచించారు. గ్రామంలో అందుబాటులో ఉన్న ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీవో జీ. నర్సయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పూర్ణచంద్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వామిదాస్, గణేష్, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సీసీలు గంగాధర్, గంగ సాయిలు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో

## కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డ జుక్కల్ ఎమ్మెల్యే తోట



కామారెడ్డి, అక్టోబర్ 8::(నేటినిజం ప్రతినిధి): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) పేరుతో కేంద్రఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 13 కోట్ల పైగా ఓటర్లను తొలగించడం జరిగిందని ,ఇది కేంద్ర బిజెపి ప్రభుత్వ కుట్రఅని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు ఘాటుగా విమర్శించారు.

కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు రాహుల్ గాంధీ అరెస్ట్ ను నిరసిస్తూ గురువారంనాడు డీసీసీ అధ్యక్షులు ఏలే.మల్లికార్జున్ తో కలసి జుక్కల్ చౌరస్తా వద్దగల జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణులు భారీ రాస్తారోకో నిర్వహించగా ఎమ్మెల్యే,డీసీసీ అధ్యక్షుడు పాల్గొన్నారు.జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపికి తొత్తుగా మారారు కాబట్టి ముందు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో వందలాది మంది ఎంపీలతో కలిసి మార్చ్ నిర్వహిచగా భారీగా పోలీసులను మోహరించి రాహుల్ గాంధీ ని రెండుసార్లు అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.జ్ఞానేష్ కుమార్ బిజెపికి లాభం చేకూరేలా ఓట్లను తొలగించడం జరిగిందని బిజెపికి వత్తాసు పలుకుతున్న జ్ఞానేష్ కుమార్ ను వెంటనే బర్త్ రఫ్ చేయాలని,ఆయనను దేశద్రోహిగా ప్రకటించాలని ఎమ్మెల్యే తోట డిమాండ్ చేశారు.ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యాన్ని ఖుని చేసే విధంగా ప్రవర్తించటం సరికాదన్నారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ,మల్లికార్జున్ ఖర్గే,కేసి వేణుగోపాల్ తో పాటు 260 మందిని అదుపులో తీసుకోవటం ఇది హేయమైన చర్యఅని జుక్కల్ ఎమ్మెల్యే తోట అభివర్ణించారు.రాస్తారోకో కారణంగా జుక్కల్ చౌరస్తా వద్దగల జాతీయ రహదారిపై గంటల తరబడి వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి,కాంగ్రెస్ శ్రేణులు లందరు నల్ల దుస్తులు,నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో లో వందలాదిగా పాల్గొన్నారు.ఇది ఇలా ఉండగా రాష్ట్రంలోనే జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతరావు ముందుగా జుక్కల్ నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్,మరియు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను కాంగ్రెస్ శ్రేణులతో కలిసి దగ్ధంచేసి నిరసనను వ్యక్తం చేశారు.

# షియర్ జోన్ గండం దాటిన ఎస్ఎల్‌బీసీ పనులు



మహబూబ్‌నగర్, అక్టోబర్ 8: శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) ఔట్‌లెట్ సొరంగం పనులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్/ ఆర్డీఓ సలోని చాబ్రా గురువారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని షియర్ జోన్‌ను దాటి సొరంగం తవ్వకాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. గత ఐదారు నెలల్లో సుమారు 700 మీటర్ల మేర తవ్వకాలు పూర్తయ్యాయని వివరించారు. మొత్తం 43.968 కిలోమీటర్ల ప్రధాన సొరంగం పనుల్లో సుమారు 79 శాతం పూర్తయ్యాయని, మరో 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు మిగిలి ఉన్నాయని వెల్లడించారు. అదనపు యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు జర్మనీ నుంచి రానున్న లోకోమోటివ్‌తో పనుల వేగాన్ని మరింత పెంచనున్నట్లు తెలిపారు.

2028 జూన్ నాటికి నీటిని అందించడమే లక్ష్యంగా పక్కా కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని సూచించారు. సొరంగం పనుల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి తాగు, సాగునీటి అవసరాలకు ఎస్ఎల్‌బీసీ నీటిని వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు, ఇంజినీర్లు, అచ్చంపేట తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

# బ్రాహ్మణపల్లిలో బుల్లెట్ రైలు కారిడార్ పరిశీలన

## హైస్పీడ్ రైలు మార్గానికి ప్రాథమిక స్థల పరిశీలన, సర్వే



మహబూబ్‌నగర్, అక్టోబర్ 8: హైదరాబాద–బెంగళూరు ప్రతిపాదిత బుల్లెట్ రైలు (హైస్పీడ్ రైల్) కారిడార్‌కు సంబంధించి నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో ప్రాథమిక స్థల పరిశీలన, సర్వే ప్రక్రియ కొనసాగుతోంది.

గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అచ్చంపేట సబ్‌కలెక్టర్/ఆర్డీఓ సలోని చాబ్రతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్థలాన్ని పరిశీలించారు.

శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ, అమన్గల్, మన్ననూర్, శ్రీశైలం మీదుగా బెంగళూరుకు హైస్పీడ్ రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. ఇందులో బ్రాహ్మణపల్లి కీలక ప్రాంతంగా మారనుంది. గ్రామ సమీపం నుంచి సుమారు 54.9 కిలోమీ టర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను శ్రీశైలం పాతాళగంగ వరకు నిర్మించే ప్రతిపాదన ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నల్లమల అటవీ ప్రాంతం, వన్యప్రాణులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఎలివేటెడ్ వయాడక్ట్‌లతో పాటు కృష్ణానదిపై ప్రత్యేక వంతెన నిర్మాణానికి ప్రణాళిక రూపొం దిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత ఎత్తునుంచి దూకగల పారాషూట్‌తో డీఆర్‌డీవో తొలి ప్రత్యక్ష ప్రయోగం

దేశంలోని అత్యంత ఎత్తయిన సైనిక పహారా ప్రదేశాలలో ఒకటైన 'న్యోమా' (ముద్ డ్రాప్‌జోన్) సమీపాన అత్యంత ఎత్తునుంచి దూకగల పారాషూట్ (ఏహెచ్‌ఏపీ)తో రక్షణ రంగ పరిశోధన-అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) తొలి ప్రత్యక్ష ప్రయోగం నిర్వహించింది.

ఈ మేరకు సముద్ర మట్టానికి 16,000 అడుగుల ఎత్తునగల ప్రదేశం నుంచి సైనికుడు దూకిన తర్వాత పారాషూట్‌ను 15,500 అడుగుల ఎత్తులో విప్పగా- అది 13,700 అడుగుల ఎత్తునగల 'న్యోమా' వద్ద దిగింది. ఈ ప్రయోగం ద్వారా అత్యంత ఎత్తయిన ప్రదేశాల నుంచి భారత పారాట్రూపర్ల ద్వారా 'ఏహెచ్ ఏపీ' వ్యూహాత్మక వినియోగ సామర్థ్యం రుజువైంది.

పారాట్రూపర్లను సామూహికంగా కిందకు దించే ఈ వ్యూహాత్మక పారాషూట్ వ్యవస్థకు ఆగ్రాలోని 'ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' (ఏడీఆర్‌డీఈ) రూపకల్పన-అభివృద్ధి బాధ్యతలను చేపట్టింది. అనంతరం కాన్పూర్‌లోని 'ఆర్డినెన్స్ పారాషూట్ ఫ్యాక్టరీ (ఓపీఎఫ్) దీన్ని ఉత్పత్తి చేయగా, 'డీజీఏక్యూఏ' దీనిపై మూల్యాంకనం పూర్తి చేసింది. అటుపైన కాన్పూర్‌లోని 'సీఈఎంఐఎల్‌ఏసీ, ఆర్‌సీఎంఏ'లు నాణ్యతను ధ్రువీకరించాయి.

'ఏహెచ్‌ఏపీ' ద్వారా వివిధ రకాల సైనిక మోహరింపు విధానాలను అనుసరించే వీలుంటుంది. ఈ కార్యాచరణ ఎత్తు పరిధి అత్యంత విస్తృతం (18000 అడుగులు) మాత్రమే గాక ఎంతో సురక్షిత అవరోహణ వేగం సాధ్యమవుతుంది. ముఖ్యంగా అధిక ఎత్తునగల భూభాగాలలో భారత రక్షణ దళాల వ్యూహాత్మక అవసరాలకు ఇది చాలా అనుకూలం. ఇలాంటి ఎత్తయిన ప్రదేశాల్లో వ్యూహాత్మక సమర్థ పారాషూట్ వినియోగం అమిత సంక్లిష్టమేగాక అది తెరుచుకోవడంలో అత్యధిక కుదుపు, అవరోహణ వేగం సహజంగా ప్రమాదానికి దారితీసేవిగా ఉంటాయి.

ఈ నేపథ్యంలో స్వదేశీ 'ఏహెచ్‌ఏపీ' పారాషూట్ వ్యవస్థను తొలిసారి ప్రయోగాత్మకంగా విజయవంతం చేయడంపై 'డీఆర్‌డీఓ'తో పాటు రక్షణ దళాలను, డీపీఎస్‌యూ'లను, సహకరించిన ఇతర పరిశ్రమలను రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. స్వయంసమృద్ధ భారత్ దిశగా ఇది కీలక మలుపని ఆయన అభివర్ణించారు. అలాగే, రక్షణశాఖ కార్యదర్శి, రక్షణ పరిశోధన-అభివృద్ధి విభాగం కార్యదర్శి-డీఆర్‌డీఓ ఛైర్మన్ శ్రీ రాజేష్ కుమార్ సింగ్ కూడా ఈ వ్యవస్థ రూపకల్పన-అభివృద్ధిలో పాలుపంచుకున్న బృందాన్ని అభినందించారు.

# నియమాధారిత సముద్ర రంగ వ్యవస్థ అవశ్యం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న మూడో విడత 'సాగరమంథన్: ది గ్రేట్ ఓషన్స్ డైలాగ్' సదస్సు నేపథ్యంలో నిన్నటి కార్యక్రమానికి అంతర్జాతీయ అగ్రనేతలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వాగతించారు. ప్రపంచవ్యాప్తంగా గల విధాన రూపకర్తలు, సముద్ర రంగ అగ్రగాములు, నిపుణులు ఇందులో పాల్గొన్నారు. అన్ని దేశాల్లో శాంతి-సౌభాగ్యాగలకు తోడ్పడే "స్వేచ్ఛాయుత, సార్వత్రిక, సురక్షిత, నియమాధారిత సముద్ర రంగ వ్యవస్థ" అవశ్యమని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

"అందరికీ మరింత ప్రగతి, శాంతి-సౌభాగ్యాలనిచ్చే స్వేచ్ఛాయుత, సార్వత్రిక, సురక్షిత, నియమాధారిత సముద్ర వ్యవస్థ సాకారం కావాలన్నదే మా దృక్కోణం. ఈ బృహత్తర దార్శనికతను సాగరమంథన్ మరింత బలోపేతం చేస్తుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను" అని ప్రధాని పేర్కొన్నారు. ఈ మేరకు ఓడరేవులు-నౌకాయానం-జల మార్గాల మంత్రిత్వశాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఆయనొక లిఖితపూర్వక సందేశం పంపారు.

ప్రపంచంలోని ఒక ప్రాంతంలో సంభవించే పరిణామాలు దాని తీరాల ఆవలగల సుదూర ప్రాంతాలనూ ప్రభావితం చేస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆ మేరకు సముద్ర రంగంపై ప్రపంచవ్యాప్త సంప్రదింపులు, సహకారం మునుపటికన్నా ఇప్పుడు మరింత ప్రధానమన్నారు. "సముద్ర మథనం" అనే అర్థమిచ్చే 'సాగరమంథన్'కు భారతీయ సంప్రదాయంలో ఒక ప్రత్యేక అర్థం ఉందని తెలిపారు. ఈ మథనం కొత్త అవకాశాల ఆవిష్కరణతో ముడిపడి ఉంటుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు, ప్రజలకు, భూగోళానికి సముద్రాలు "అపార భరోసా" ఇస్తున్నాయని ఆయన అన్నారు.

"సముద్రంతో భారతదేశానికి గల సంబంధం కూడా బాధ్యతకు సంబంధించినదే. మనం బలమైన సముద్ర ఆర్థిక వ్యవస్థను రూపొందిస్తూనే మన సముద్రాలు, తీరప్రాంత వ్యవస్థల ఆరోగ్యాన్ని మనం కాపాడుకుంటున్నాం. ప్రాంతాలు, సముద్ర రంగమంతటా విస్తరించిన భారత సముద్రరంగ భారత్ దృక్కోణం- సహకారం, విశ్వాసం, పరస్పర గౌరవం-ప్రయోజనాలపై ఆధారపడినది. సముద్రాలు సమష్టి సౌభాగ్యానికి మూలం కావాలని, ప్రతి దేశానికి తనదైన గళం వినిపించగల, అభివృద్ధి చెందగల అవకాశం లభించాలన్నది మా ప్రగాఢ ఆకాంక్ష" అని ప్రధానమంత్రి తన సందేశంలో స్పష్టం చేశారు.

ప్రాచీన రేవు పట్టణమైన లోథాల్ నుంచి చోళ రాజవంశం దాకా? మరాఠా పాలకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ నావికాదళ దార్శనికత వరకూ భారత సముద్రరంగ చరిత్ర విస్తరించిందని మోదీ వివరించారు. భారత నావికులు, వ్యాపారులు తమ వస్తువులతో పాటు ఆలోచనలు, కథలు, సంస్కృతిని సుదూర ప్రాంతాలకు విస్తరింపజేశారని ఆయన అన్నారు. దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా రూపొందించాలన్న ప్రభుత్వ లక్ష్యం దేశ సముద్రరంగ ఆకాంక్షలుతోనూ ముడిపడి ఉందని ప్రధానమంత్రి విశదీకరించారు.

దేశంలోని ప్రధాన ఓడరేవుల సామర్థ్యం నేడు దాదాపు రెట్టింపు దాటిందని, సరకు రవాణా సమయం గణనీయంగా తగ్గిందని అన్నారు. "భారత్ ఒక వినూత్న లక్ష్యంతో సముద్ర రంగంపై దృష్టి సారించింది. దేశం 2047 నాటికి వికసిత భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకోవడంలో మరింత పటిష్ట, సమర్థ భారత సముద్రరంగ ప్రస్థానం కూడా కీలకమేనని పేర్కొన్నారు. "నౌకా నిర్మాణం, పర్యావరణ హిత నౌకాయానంలో నవ శకంవైపు మేమిప్పుడు పయనిస్తున్నాం. మా ప్రధాన ఓడరేవుల సామర్థ్యం దాదాపు రెట్టింపును అధిగమిచగా, నౌకలు తిరుగు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గింది" అని వివరించారు.

దేశంలోని సముద్రాలపై అవగాహనను మరింత పెంచుకోవడానికి, వాటి బాధ్యతాయుత వినియోగానికి వీలుగా సముద్ర శాస్త్రం-అన్వేషణలోనూ ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. "ఈ రంగం కోసం ఆధునిక చట్టం రూపకల్పన దిశగా భారత్ నవతరం సముద్రయాన చట్టాలను తెచ్చింది. అలాగే, సముద్రాలపై మరింత అవగాహనతోపాటు వాటి అపార సామర్థ్యాన్ని బాధ్యతాయుతంగా వాడుకోవడానికీ మేం సముద్ర శాస్త్రం-అన్వేషణలో పెట్టుబడులు పెడుతున్నాము" అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

ప్రపంచంలో రెండో అతిపెద్ద సముద్రరంగ కార్మిక శక్తిగా భారతీయ నావికులను ఇప్పుడు పరిగణిస్తున్నారని, ఆ మేరకు భారత యువత అంతర్జాతీయ జలాల్లో గౌరవాన్ని సముపార్జిస్తున్నారని శ్రీ మోదీ అన్నారు. బలమైన సముద్రరంగ ఆర్థిక వ్యవస్థ రూపకల్పతోపాటు సముద్ర ఆరోగ్యాన్ని, తీరప్రాంత వ్యవస్థలను భారత్ పరిరక్షిస్తోందని ఆయన చెప్పారు. సహకారం, విశ్వాసం, పరస్పర గౌరవం, ప్రయోజనాలపై భారత సముద్రరంగ దృక్పథం ఆధారపడి ఉందని ఆయన అన్నారు."సముద్రాలు సమష్టి సౌభాగ్యానికి మూలం కావాలని, ప్రతి దేశానికి తన గళం వినిపించగల, పురోగమనం సాధించగల అవకాశం ఉండాలని మేం విశ్వసిస్తున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు. సాగరమంథన్ ఆ దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో చర్చలు భావి తరంలో సరికొత్త ఆలోచనలు రేకెత్తించడమే కాకుండా పటిష్ఠ భాగస్వామ్యాలు, అపార అవకాశాలకు తోడ్పడగలవని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

# 'పని ప్రదేశంలో మానసిక ప్రశాంతత' అంశంపై 'మినీ చింతన్ శిబిరం' నిర్వహించిన ఉక్కు మంత్రిత్వశాఖ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:న్యూఢిల్లీలోని చాణక్యపురిలో గల సివిల్ సర్వీసెస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్ (సీఎస్‌వోఐ) వేదికగా ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ రోజు 'పని ప్రదేశంలో మానసిక ప్రశాంతత' అంశంపై మినీ చింతన్ శిబిరం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు ఒత్తిడి లేని పని వాతావరణాన్ని సృష్టించుకుని... భావోద్వేగపరమైన బలాన్ని పెంపొందించుకునేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. ప్రముఖ ఆధ్యాత్మిక వక్త బ్రహ్మ కుమారి సిస్టర్ శివాని ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కార్యక్రమ ప్రారంభంలో ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సందీప్ పౌండ్రిక్ సభనుద్దేశించి మాట్లాడుతూ... పని ప్రదేశంలో మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. అది ఉత్పాదకతను, సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ అంశంపై సిస్టర్ శివాని మాట్లాడుతూ... ఒత్తిడిని తగ్గించుకోవడం, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు. ఏదైనా సాధించాలని మనం దృఢ నిశ్చయం చేసుకున్నప్పుడే దానిని పూర్తి చేసే దిశగా అడుగులు వేయగలమన్నారు. ఒత్తిడిని నిర్వహించే విషయంలోనూ ఇదే విధానాన్ని అనుసరించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి పరిస్థితిలోనూ సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాల్సిన ప్రాముఖ్యతను సిస్టర్ శివాని ప్రముఖంగా ప్రస్తావించారు.

సంకల్ప శక్తిని వివరిస్తూ... ఒక సంకల్పాన్ని పదే పదే తలచుకోవడం వల్ల అది మన జీవితాలపై ప్రభావం చూపడం ప్రారంభిస్తుందని సిస్టర్ శివాని పేర్కొన్నారు. మనం ఏదైనా విషయాన్ని ఎంత ఎక్కువగా ఆలోచిస్తూ, పునరావృతం చేస్తామో... అది మన ఆలోచనలను, ప్రవర్తనను అంతగా తీర్చిదిద్దుతుందన్నారు. మన ఆలోచనలు, సంకల్పాలు సానుకూలంగా ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యమని సిస్టర్ శివాని తెలిపారు. ఇదే 'సంకల్పం ద్వారా సిద్ధి' సూత్రమని, ఇది మన సమాజాన్ని, దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించగలదని ఆమె వ్యాఖ్యానించారు.

# ఖమ్మం ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంగా మారబోతోంది..

## మంత్రి క్యాంపు కార్యాలయంలో ముందస్తు ఏర్పాట్లపై విస్తృత స్థాయి సమీక్ష

ఖమ్మం, అక్టోబర్ 8 ఖమ్మం నగరం రూపురేఖలను మార్చేలా, దక్షిణ తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అల్లిపురం అభివృద్ధి చెందనుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి ఈ నెల 12న భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. భూమిపూజ ఏర్పాట్లపై గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఖమ్మం జిల్లా అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరై ఏర్పాట్లపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.



భక్తుల భాగస్వామ్యంతో నవధాన్య సమర్పణ

అల్లిపురంలో తిరుమల శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు కావడం ఖమ్మంకు ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపును తీసుకురానుందని యుగంధర్ పేర్కొన్నారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా భూమిపూజ జరగడం విశేషమన్నారు. ప్రతి ఏటా తిరుమల వెళ్లలేని భక్తులకు అల్లిపురం ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. భూమిపూజకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వేడుకలో భక్తులు నేరుగా పాల్గొనేలా నవధాన్య సమర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

పటిష్ఠ ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, అన్నప్రసాద వితరణ, భద్రత, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పోలీస్, వైద్య, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని యుగంధర్ పిలుపునిచ్చారు. ఖమ్మం చరిత్రలో ఈ కార్యక్రమం ప్రత్యేక ఘట్టంగా నిలిచేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో నాగండ్ల దీపక్ చౌదరి, సౌజన్య, హనుమంతరావు, కురివెళ్ల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

## గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా
## డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరం గా ఉండాలి
## రౌడీషీటర్లు, అల్లరి మూకలపై కఠిన చర్యలు
## ఖానాపురం హవెలి నూతన సీఐ నాగరాజు

ఖమ్మం, అక్టోబర్ 8 ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని నూతన సీఐ నాగరాజు హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లు, అల్లరి మూకల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.




ఖానాపురం హవేలీ పరిధిలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సీఐ నాగరాజు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. చదువు, క్రీడలపై దృష్టి సారించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి ఆశయాలకు అనుగుణంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో పోలీసింగ్: ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై తక్షణమే స్పందించేలా పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేస్తామని సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు

# 'సేవ, సమర్పణ'లో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'సేవ, సమర్పణ'లో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

'ఎక్స్' వేదికగా చేసిన వరుస పోస్టుల్లో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు... "అలుపెరుగని కృషి, అద్భుతమైన సంకల్పం, దేశానికి ప్రథమ ప్రాధాన్యం అనే మార్గదర్శక సూత్రంతో కూడిన 'సేవ, సమర్పణ'లో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రఖ్యాత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీజీకి హృదయపూర్వక అభినందనలు. సరిగ్గా ఇదే రోజున అంటే అక్టోబర్ 7, 2001న మోదీజీ గుజరాత్ ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకా రం చేశారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రి గా ఆయన పదవీకాలంలో కొనసాగిన 'సేవ, సంఘర్షణ, సమర్పణ'ల నిరంతర ప్రయా ణం... పేదల సంక్షేమం, మహిళా సాధికారత, యువత అభ్యున్నతి, సమాజంలోని ప్రతి వర్గం శ్రేయస్సులో ప్రతిబింబిస్తుంది. ఈ 25 ఏళ్ల పాలనలో మోదీజీ ప్రజా సంక్షేమ విధానాలు, వాటి సమర్థమైన అమలు, నిర్ణయాత్మక నాయకత్వం, పారదర్శకత, ఫలితాల నిశ్చయతతో కూడిన పరిపాలనను పునర్నిర్వచించారు. తద్వారా 'పనితీరు ఆధారిత రాజకీయాల' ఆదర్శాన్ని నెలకొల్పారు."

శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు... "ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, భూకంపం వల్ల ధ్వంసమైన కచ్ ప్రాంతాన్ని మోదీజీ ఆదర్శవంతమైన ప్రాంతంగా పునర్నిర్మించారు. 'జ్యోతి గ్రామ్ యోజన' ద్వారా ప్రతి గ్రామానికి 24 గంటల విద్యుత్ అందేలా చేశారు. సౌరశక్తి, 'వైబ్రంట్ గుజరాత్' కార్యక్రమాల ద్వారా పెట్టుబడులు, పరిశ్రమ లకు కొత్త దిశానిర్దేశం చేశారు. 8 శాతానికి పైగా వ్యవసాయ వృద్ధి రేటును సాధించి, గుజ రాత్‌లో సుపరిపాలన నమూనాను నెలకొల్పారు.

# ఫేజ్-2 కోసం కేంద్రాన్ని రూ.42,500 కోట్ల సాయం కోరాం: మంత్రి నిమ్మల

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తులో కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.

ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన అనంతరం నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర జలశక్తి మంత్రి, ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన సమావేశం సానుకూలంగా సాగిందని తెలిపారు.

గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడంతో పరిస్థితి క్లిష్టంగా మారిందని మంత్రి ఆరోపించారు. ముఖ్యంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడం వల్ల ప్రాజెక్టు పనులకు ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పోలవరం సివిల్ పనులు 88 శాతం పూర్తయ్యాయని చెప్పారు.

భూసేకరణ, పునరావాసం, పునరావాస ప్యాకేజీ (ఖీడఖీ) పనులు ఆర్థికంగా 64 శాతం పూర్తయ్యాయని వివరించారు. మొత్తంగా ప్రాజెక్టు భౌతిక పురోగతి 83 శాతానికి, ఆర్థిక పురోగతి 78 శాతానికి చేరినట్లు మంత్రి వెల్లడించారు.

పోలవరం ప్రాజెక్టు రెండో దశ పనులకు కేంద్రం నుంచి రూ.42,500 కోట్ల ఆర్థిక సహాయం కోరినట్లు నిమ్మల రామానాయుడు తెలిపారు.

# ఐఐసీటీ, యూట్యూబ్ సహకారంతో నిర్వహిస్తోన్న 'క్రియేట్ విత్ ఏఐ' కార్యక్రమం కింద నాలుగు కృత్రిమ మేధస్సు ఆధారిత చిత్రాల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ), యూట్యూబ్ సంయుక్తంగా నిర్వహిస్తోన్న 'క్రియేట్ విత్ ఏఐ' కార్యక్రమం ఒక కీలక ఘట్టానికి చేరుకుంది. ఏఐ ఆధారిత సృజనాత్మక ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వడానికి, వర్ధమాన సాంకేతికతలో భారత్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి 2025 నవంబర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఏఐ ఉపయోగించి తీసిన మొదటి నాలుగు లఘు చిత్రాలు ఇందులో భాగంగా తొలిసారిగా విడుదలయ్యాయి. ఏఐ నేతృత్వంలోని చలనచిత్ర నిర్మాణంలో భారత్‌ను ప్రపంచ నాయకుడిగా నిలబెట్టగల ఒక వ్యవస్థను తయారు చేయటంలో ఇదొక కీలక ఘట్టం.

నేడు ముంబయిలోని ఐఐసీటీ థియేటర్‌లో ఈ నాలుగు చిత్రా లను ఆవిష్కరించారు. అదే సమయంలో చిత్రనిర్మాతలు తమ యూట్యూబ్ ఛానళ్లలో కూడా వీటిని విడుదల చేశారు. చరిత్ర, పౌరాణికం, మానవ భావోద్వేగ, అంతరిక్ష అన్వేషణ వంటి విభిన్న అంశాలను, కథా చెప్పే విధానాలను ఈ చిత్రాలు తెలియజేస్తున్నాయి. ఏఐ ఆధారిత చలనచిత్ర నిర్మాణంలోని సృజనా త్మక సాధ్యాసాధ్యాలను ఇవి నిరూపిస్తున్నాయి.

1741 నాటి చారిత్రాత్మక కొలచెల్ యుద్ధం నేపథ్యంలో సాగే ఒక కల్పిత చలనచిత్ర కథే ఏవియం స్టూడియోస్ వారి 'చెకావర్'. ఆ కాలపు భూమి, ప్రజలు, ధైర్యసాహసాలు, యుద్ధ కళా సంప్రదాయాల నుంచి ఈ చిత్రం స్ఫూర్తి పొందింది.

తత్వవేత్త, వ్యూహకర్త, మౌర్య సామ్రాజ్య నిర్మాత అయిన చాణక్యుని గురించి తెలియని ప్రయాణాన్ని ఆవిష్కరించే చారిత్రతక ఇతిహాసమే ఎలవెన్త్ డోర్ స్టూడియో వారి 'చాణక్య - ది మైండ్ ఆఫ్ యాన్ ఎంపైర్' చిత్రం. శక్తికి సంబంధించిన దైవిక అభివ్యక్తిని, విశ్వ సమతుల్యతను పునరుద్ధరించడానికి ఆమె చేసిన పురాణ పోరాటానికి సంబంధించినది కల్పనిక్ ఫిల్మ్స్ వారి 'దేవి: ది నైన్ ఆస్ట్రాస్' చిత్రం.

కార్తీక్ కుల్ క్రియేషన్స్ వారి 'లైకా' చిత్రం.. అంతరిక్ష యానం చేసిన ఒక కుక్క భావోద్వేగ ప్రయాణాన్ని చూపుతుంది. అంతరిక్ష అన్వేషణ నేపథ్యంలో ధైర్యం, త్యాగం, మానవులు-జంతువుల మధ్య ఉన్న బంధం వంటి అంశాలను ఇది అన్వేషిస్తుంది.

చిత్రరూపకర్త అనే వారు కథాంశానికి కేంద్ర బిందువుగానే ఉంటూ సృజనాత్మక సాధ్యతలను పెంచినప్పుడే ఏఐ అత్యంత శక్తిమంతంగా పనిచేస్తుందని ఈ చిత్రాలు నిరూపిస్తున్నాయి. గూగుల్, యూట్యూబ్ ఏఐ సాంకేతికతలు..ఐఐసీటీ మౌలిక సదుపాయాలు, అక్కడి అధ్యాపకుల మార్గదర్శకత్వం, చిత్రనిర్మాతల ఊహాశక్తిని ఒకచోట చేర్చడానికి 'క్రియేట్ విత్ ఏఐ' కార్యక్రమాన్ని ఒక ఆచరణాత్మక ప్రయోగంగా రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా ఐఐసీటీ సీఈఓ డాక్టర్ విశ్వాస్ డియోస్కర్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారిత చలనచిత్ర నిర్మాణంలో తదుపరి అధ్యాయానికి నాయకత్వం వహించే అవకాశం భారత్‌కు ఉందని అన్నారు.

# తోకలేని పిట్ట తొంబై ఆమడలు దూరం”

” తోకలేని పిట్ట తొంబై ఆమడలు దూరం పోతుంది” అన్న సామెతను అక్షరాలా నిజం చేస్తూ అతి తక్కువ ధరకే సేవలందిస్తున్న తపాలాకు, గ్రామీణ ప్రజలకు మధ్య అనుబంధం శతాబ్దాల నాటిది. ఐక్యరాజ్య సమితి చేపట్టిన తీర్మానాన్ని అనుసరించి ప్రతి సంవత్సరం అక్టోబర్ 9వ తేదీని అంతర్జాతీయ తపాలా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. చరిత్రను తిరిగి చూస్తే లోకి "మెసెంజర్ల" రూపంలో తపాలా సర్వీసులుండేవి. వీళ్లు నడిచి లేదా గుర్రాల మీద వెళ్లి రాత ప్రతుల్ని అటూ ఇటూ చేర వేసేవారు. 1600 – 1700 సంవత్సరాలలో అనేక దేశాల వారు జాతీయ తపాలా వ్యవస్థలను నెలకొల్పుకొని ఆయా దేశాల నడుమ తపాలా సౌకర్యాల్ని అందించు కునేందుకు "ద్వైపాక్షిక ఒప్పందాలు" చేసుకున్నారు. 1800 సంవత్సరం నాటికి ఇలా ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నవారు భారీగా తేలారు. దీంతో అంతర్జాతీయ తపాలా పంపిణీ క్లిష్టంగా, అసంపూర్తిగా, అసమర్థ వంతంగా మారిపోయింది.

అమెరికాకు చెందిన పోస్ట్ మాస్టర్ జనరల్ మాంట్ గోమెరి బ్లెయిర్ 1863 లో 15 యూరొపియన్ దేశాలు, అమెరికన్ దేశాల ప్రతినిధులతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసాడు . ఈ సదస్సులో అంతర్జాతీయ పోస్టల్ సర్వీసులపై పరస్పర ఒప్పందాల కోసం ప్రతినిధులు అనేక సాధారణ సూత్రాలను వెల్లడించారు. కాని ఒక అంతర్జాతీయ ఒప్పందం మాత్రం కుదరలేదు. 1874 లో నార్త్ జర్మన్ కాన్ ఫెడరేషన్‌కు చెందిన ఓ సీనియర్ పోస్టల్ అధికారి హెయిన్ రిచ్ బనీ స్టీఫెన్ స్విట్జర్లాండ్ లోని బెర్నెలో 22 దేశాల ప్రతినిధులతో ఒక సదస్సు ఏర్పాటు చేశాడు. ఆ ఏడాది అక్టోబరు తొమ్మిదో తేదీన ప్రతినిధులు "బెర్నె ఒప్పందం"పై సంతకాలు చేసి జనరల్ పోస్టల్ యూనియన్‌ను నెలకొల్పారు.

ఈ యూనియన్ లో సభ్య దేశాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. యూనియన్ పేరు 1878 లో "యూనివర్సల్ పోస్టల్ యూనియన్" గా మారింది. ఇది 1948 లో ఐక్య రాజ్య సమితికి ప్రత్యేక ఏజెన్సీగా రూపాంతరం చెందింది. 1969 లో అక్టోబరు 1 నుంచి నవంబరు 16 వ తేదీ వరకు జపాన్ టోక్యో లో 16 వ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ కాంగ్రెస్ ను నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సులో ప్రతినిధులు అక్టోబరు 9 వ తేదీన "వరల్డ్ పోస్టల్ డే" ని నిర్వహించాలని తీర్మానించారు. అప్పటి నుండి, తపాలా సేవల యొక్క అవసరాన్ని గుర్తిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 9 న ఈ ప్రపంచ తపాలా దినోత్సవమును జరుపు కుంటున్నారు. "దినాదినాభివృద్ధి చెంది, రోజువారీ ప్రజల జీవితాలు మరియు వ్యాపారాలలో తపాలాశాఖ పోషించే పాత్రను గూర్చి ప్రజల్లో అవగాహనను రేకెత్తించడం మరియు దేశాల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో తపాలా శాఖ ఔన్నత్యాన్ని తెల్పడం కోసం ఈ రోజును జరుపు కుంటారు. ఒక చిన్న పాయగా మొదలైన తపాలా విధానం తరువాత అన్ని దేశాలకు వేగంగా పాకి పోయింది. 1800 నాటికి ప్రపంచ తపాలా వ్యవస్థ ఏర్పడింది. కాగా 1837లో మన దేశంలో తపాలా వ్యవస్థ ప్రారంభమైంది. "భారత తపాలా శాఖ"ను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అక్టోబర్ 1,1854న ఏర్పాటు చేసింది. తపాలా బిళ్ళ (పోస్టల్ స్టాంప్) అప్పటి సింధ్ (ఇప్పటి పాకిస్తాన్) ప్రాంతంలో తొలుత వాడుకలోకి వచ్చింది. పోస్టల్ వ్యవస్థ సక్రమంగా ఏర్పాటు కాకముందే భారత్‌లో మొదటిసారి "వారెన్ హేస్టింగ్స్" కోల్‌కత కార్యాలయంలో 1774లో "మొదట తపాలా కార్యాలయాన్ని" తెరిచారు. ప్రపంచం లోని తపాలా శాఖలన్నింటిలో భారత తపాలా రారాజు లాంటిది. భారత దేశంలో మార్చి 31,2015 నాటికి 1,54,939 తపాలా

## అక్టోబర్ 9... ప్రపంచ తపాలా దినోత్సవం



కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 1,39,222(89.86%) గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు ఉన్న తపాలా కార్యాలయాలు 23,344 మాత్రమే. చిన్ననాటి నుండి పాఠశాల రోజుల్లో రాసిన హెడ్‌మాస్టర్‌కు సెలవు చీటీ నుంచి కాలేజీ రోజుల్లో ఖర్చుల కోసం తల్లిదండ్రులకు రాసే ఉత్తరం, స్నేహితులతో సత్సంబంధాలు పాదు కొల్పేందుకు, అనంతరం జీవితానికో అర్థం తెచ్చి పెట్టే ఉద్యోగం కోసం చేసే దరఖాస్తుకు అంటించే తపాలా బిళ్ళలు... ఇలా ఎన్నెన్నో విషయాలు జీవితాలతో ముడి వేసుకున్నాయి. ఉత్తరం అందుకోవడం, రహస్యంగా విప్పి చదువు కోవడం, ఎవరైనా వస్తుంటే దిండు కింద దాచుకోవడం ప్రేమికులకు ఖర్చులేని ఓ మధురానుభూతి. దూరంగా సైన్యంలోనో, మరో ఉద్యోగంలోనో ఉన్న భర్తో, కొడుకో ఉత్తరం రాస్తాడనీ, క్షేమ సమాచారం చెబుతాడనీ వీధి వంక చూస్తూ గడిపే కాలం ఇంకా మధురమైనది. తరతరాలుగా తమ జీవన స్రవంతిలో ఈ తపాలా ఉత్తరం పట్ల తమకు గల మమకారాన్ని చిన్నా, పెద్దా తేడా లేకుండా స్త్రీ, పురుష బేధం పాటించకుండా ప్రతి ఒక్కరూ చాటుకున్నారు. అయితే సాంకేతికత అందుబాటు లోకి రావడంతో ఉత్తరాలు రాసుకునే తరం అంతరించి పోయింది. ఇంటికి వచ్చిన ఉత్తరాలను పొడవాటి ఇనుప కమ్మీకి గుచ్చిఉంచడం. అవసరమైనపుడు మళ్లీ తీసి చదువు కోవడం రెండు మూడు దాశాబ్దాల క్రితం ప్రతి ఇంటా ఉండేది. ఆడపిల్ల చదివి ఊళ్లేలాలా? ఉత్తరాలు చదువుకో గలదు చాలు అన్న కాలం కూడా అదే? రోజులు మారి, కంప్యూటర్, మొబైల్ ఫోన్లు, అంతర్జాలం అందుబాటులోకి వచ్చిన నేటికాలంలో ఉత్తరాలు రాయటం దాదాపు లేదనే చెప్పాలి. ఇపుడు పోస్ట్ అంటే బ్యాంకు నుంచి, సెల్ ఫోన్ కంపెనీల నుంచీ వచ్చే పార్శల్లు, బిల్లులు, డేటా వివరాలు మాత్రమే. కానీ ఆ రోజుల్లో చాలా తక్కువ ఖర్చుతో సమాచారాలు అందేవి. వందల, వేల మైళ్ళు ప్రయాణం చేసి వచ్చే ఆ తోక లేని పిట్ట కోసం ఆతృతగా ఎదురు చూసి "పోస్ట్" అన్న కేక వినగానే ఉరుకులు, పరుగులతో అందుకునే ఉత్తరాల్లో ఎన్నో విశేషాలు , అనేక కమ్మని కబుర్లు, కెరీర్ కు బాటలు... మంచి ఉత్తరం అందుకున్నప్పుడు కలిగే సంతోషం అంతా ఇంతా కాదు. అలాగే మనియార్డర్లు.. సంతోషంతో పోస్ట్ మ్యాన్ కు ఈనాం ఇచ్చే ఆనవాయితీ నెలకొని పోయింది. గతంలో సమాచార మార్పిడికి, క్షేమ సమాచారము తెలుసు కునేందుకు పోస్టు కార్డే(ఉత్తరం) ప్రధాన ఆధారం. పేదల నుండి ధనికుల వరకు ఎక్కువగా దీనిపైనే ఆధార పడేవారు. సమాచార రంగంలో రానురాను విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఉత్తరం ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో మార్పులను అందిపుచ్చుకుంటూ మనుగడను కొనసాగిస్తూనే ప్రత్యేకతను నిలబెట్టు కుంటోంది భారత తపాలశాఖ. పావురాల ద్వారా బట్వాడా నుంచి.. స్పీడు పోస్టు.. ఈ–మెయిల్ ఇలా దూసుకెళ్తున్న భారత తపాలా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని మూట గట్టుకుంది. ఉత్తర ప్రత్యుత్తరాల వారధులుగా అశేష సేవలందిస్తున్న ఈ విభాగం ప్రస్థానం "ఇంతింతై వటుడింతై" అన్నట్లు సాగింది. ప్రయివేటు రంగం నుంచి వచ్చిన పోటీని తట్టుకొని నిలబడుతోంది. రెండో అతి పెద్ద వ్యవస్థ తపాలశాఖ గతంలో ఉత్తరాలు బట్వాడాకే పరిమితం కాగా కాలక్రమంలో అనేక సేవల్లోకి మారింది. ప్రస్తుతం దేశంలో సుమారు ఆరు లక్షల మంది

తపాలా సిబ్బంది 1.10 లక్షల కార్యాలయాలతో సేవలందిస్తోంది. దేశంలో రైల్వే తర్వాత ఇదే అతి పెద్ద వ్యవస్థ. స్పీడు పోస్టు కోసం మనదేశంలో 180 కేంద్రాలున్నాయి. 100కు పైగా దేశాలకు ఈ సౌకర్యం ఉంది. ప్రపంచంలో ఏమూల నుంచైనా "ఇ పోస్టు" చేస్తే క్షణాల్లో ఎంపిక చేసిన పట్టణాల్లో పోస్టుమన్ ద్వారా ఇంటికి అందుతుంది. బంగారు నాణాలు, ఫారెన్ ఎక్చేంజ్ కరెన్సీ మార్చుకోవడం లాంటి అనేక సౌకర్యాలు అందిస్తుంది. బిల్ మెయిల్ సర్వీసు. పెద్ద పెద్ద సంస్థలు, ఫ్యాక్టరీలు తమ సంస్థ ఆర్థిక నివేదికలు, బిల్లులు, ఇతరత్రా చేరవేత, గ్రామీణ మార్కెటింగ్ విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టిన మేఘదూత్ పోస్టుకార్డు, మరో

ఎక్స్‌ప్రెస్ పార్సిల్ పోస్టు..2006లో ఇన్‌స్టెంట్ మనీ ఆర్డర్ సర్వీసు ఇలా సౌకర్యాలను మెరుగు పరుస్తోంది.కాలగమనం లో వచ్చిన మార్పులు దీనిపై పెను ప్రభావం చూపాయి . సెల్ ఫోన్లూ, కంప్యూటర్లూ, ఇతర సాంకేతిక సాధనాలు అందుబాటు లోకి వచ్చాక కార్డు అవసరం తగ్గి, ఇ–మెయిల్స్ చాలా వరకు ప్రస్తుతం పోస్టుకార్డు పాత్రను పోషిస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఇప్పటికీ పోస్టుకార్డునే వినియోగిస్తున్నారు.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జె.పి. నడ్డా నేతృత్వంలో భారత్ మండపంలో రేపు 'జోష్' బృందాల జాతీయ స్థాయి ప్రారంభ కార్యక్రమం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖల సహకారంతో 2026 అక్టోబరు 8న న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా 'జోష్' (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్) బృందాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రారంభించనుంది. తొలి విడతలో 11 రాష్ట్రాల్లోని 55 జిల్లాల్లో ఈ జోష్ బృందాలను రంగంలోకి దించనున్నారు. యువత ఆధ్వర్యంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం, టీబీ ముక్త్ భారత్ సందేశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. దేశంలో క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన దిశగా సాగుతున్న పోరాటంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇదొక ముఖ్యమైన ముందడుగు.

కేంద్ర కార్మిక, ఉపాధి – యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ, రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్, ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్త సమక్షంలో.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ – రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ఈ జోష్ బృందాల జాతీయ స్థాయి ప్రారంభోత్సవానికి నేతృత్వం వహిస్తారు. భాగస్వామ్య మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, క్లాన్–ఎ అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్లు, దేశ టీబీ నిర్మూలన కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈ కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ సాధించిన కీలక విజయాలను వివరిస్తూ రూపొందించిన వీడియో ప్రదర్శన ఉంటుంది. అనంతరం జోష్ బృందాలను అధికారికంగా ప్రారంభిస్తారు.

దీనితోపాటు టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు సంబంధించిన కొత్త సమాచారం, విద్య, ప్రచార సాధనాలనూ ఆవిష్కరిస్తారు. అంతేకాకుండా ప్రజల్లో అవగాహనను పెంపొందించడం, సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, టీబీ నిర్మూలన జాతీయ లక్ష్య సాధనలో సమాజ క్రియాశీల పాత్రను పెంచడం ధ్యేయంగా.. ఏఐ ఆధారిత చాట్‌బాట్ 'ఖుషి అవతార్'ను కూడా ఆవిష్కరిస్తారు.

దేశ యువత ఉత్సాహాన్నీ, వారి విస్తృత పరిధినీ టీబీ నిర్మూలన దిశగా ఒక వ్యవస్థీకృత ప్రజా ఉద్యమంగా మలిచేందుకు ఒక నిర్మాణాత్మక యంత్రాంగంగా 'జోష్' బృందాలను రూపుదిద్దారు. పాలనపరమైన నాయకత్వాన్నీ, మై భారత్, ఎన్‌సీసీ వ్యవస్థల విస్తృత యువజన నెట్‌వర్క్, సామాజిక భాగస్వామ్య సామర్థ్యాలనూ మేళవిస్తూ... క్లాస్–ఎ అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్లను ఈ బృందాలు ఏకతాటిపైకి తెస్తాయి.

మొదటి దశలో ఈ కార్యక్రమం బ్లాక్/వార్డు, కమ్యూనిటీ స్థాయిల్లో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుంది. తద్వారా టీబీ ముక్త్ భారత్ సందేశాన్ని ఆరోగ్య కేంద్రాలకే పరిమితం చేయకుండా.. జనావాసాలకు, పని ప్రదేశాలకు, ప్రజల కూడళ్లకు మరింత చేరువ చేస్తుంది.

సామాజిక అవగాహన కార్యక్రమాలు, సమాజ భాగస్వామ్యం ద్వారా.. టీబీ లక్షణాలు, నివారణ, సకాలంలో రోగనిర్ధారణ, చికిత్సను పూర్తి చేయడంపై కీలక సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో జోష్ బృందాలు తోడ్పాటునందిస్తాయి.

అలాగే టీబీపై అపోహలను తొలగించడం, టీబీ బాధితులపై సామాజిక వివక్షను తగ్గించడం, దేశవ్యాప్త టీబీ నిర్మూలన ఉద్యమంలో వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సమాజపరంగా ప్రతి ఒక్కరూ క్రియాశీలంగా పాల్గొనేలా ప్రోత్సహించడంలో ఇవి విశేష పాత్ర పోషిస్తాయి.

టీబీ నిర్మూలన పోరాటంలో యువతను భాగస్వాములను చేయడం, అవగాహన పెంపొందించడం, సామాజిక చైతన్యాన్ని తీసుకురావడం, సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడం కోసం వారికి ఒక స్పష్టమైన వేదికను కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం. క్లాస్–ఎ అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్ల మధ్య సమన్వయం.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలతో మరింత బలంగా అనుసంధానించడానికి ఎంతగానో తోడ్పడుతుంది.

జన భాగిదారీని దేశ టీబీ నిర్మూలన చర్యలకు మౌలిక ప్రాతిపదికగా జోష్ నిలుపుతోంది. 2025లో.. 697 జిల్లాల్లోని 67,933 పంచాయతీలు టీబీ రహిత గ్రామాలుగా గుర్తింపును పొందాయి.

దేశ టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు, సమాజ భాగస్వామ్యంతో కూడిన సమష్టి కృషికి ఇది నిదర్శనం.

టీబీ నిర్మూలన సందేశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో.. స్థానిక నాయకత్వం, సామాజిక నేతృత్వం, నిరంతర భాగస్వామ్యాల ఆవశ్యకతను ఇది చాటుతోంది. క్షయవ్యాధి నివారణ చర్యలపై అవగాహన, ఆ దిశగా సామాజిక సమీకరణ, భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా.. యువత శక్తి, విస్తృత ప్రచారం, సామాజిక వ్యవస్థల సద్వినియోగం ద్వారా ఈ జన భాగిదారీ స్ఫూర్తిని జోష్ బృందాలు మరింత ముందుకు తీసుకెళ్తాయి.

ఆరోగ్య, యువజన, రక్షణ రంగాల సంస్థాగత బలాలు, సామాజిక ప్రచార వ్యవస్థలను ఏకతాటిపైకి తేవడం ద్వారా.. ఏకోన్ముఖ ప్రభుత్వ, సామాజిక సమగ్రతా విధానానికి జోష్ బృందాలు ప్రతినిధులుగా నిలుస్తాయి.

ప్రజారోగ్య విధానాన్ని, టీబీ నిర్మూలన కార్యాచరణను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమంలో వివరిస్తుంది. కాగా మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్ల ప్రాతినిధ్యానికి మార్గం సుగమం చేస్తూ... క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించడంలోనూ, అవగాహన ప్రచారంలోనూ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖలు ముఖ్యభూమిక పోషిస్తున్నాయి.

ప్రభుత్వం ఎప్పటికప్పుడు వివిధ మంత్రిత్వ శాఖలు, రంగాల మధ్య సమన్వయానికి ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ కార్యక్రమం నిదర్శనం. విభిన్న సంస్థాగత, సామాజిక వ్యవస్థలు కలిసి ఒక ఉమ్మడి జాతీయ లక్ష్యానికి దోహదపడేలా ఇది వీలు కల్పిస్తుంది.

ప్రజలే కేంద్రంగా ఉన్న, ప్రాతినిధ్య, సామాజిక టీబీ నిర్మూలన కార్యక్రమాల దిశగా ప్రభుత్వ చర్యల్లో 'జోష్' బృందాలు మరో కీలకమైన ముందడుగు. మంత్రులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఆరోగ్య కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యువత, ప్రజలందరి సమష్టి కార్యాచరణే ఇందుకు ప్రాతిపదిక.

క్షేత్రస్థాయిలో బలమైన భాగస్వామ్యం, క్రియాశీల జనభాగిదారీ ద్వారా... టీబీ ముక్త్ భారత్ నిర్మాణం దిశగా సమష్టి సంకల్పాన్ని జోష్ బృందాలు మరింత బలోపేతం చేస్తాయి.

---

# ఆర్ఐఎన్ఎల్' భూమి ఇ-వేలం ప్రక్రియకు ముందు నమూనా ఇ-వేలం ద్వారా 'ఎన్ఎల్ఎంసీ' అవగాహన

న్యూఢిల్లీ, అక్టోబర్ 8:విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కార్పొరేట్ సంస్థ 'రాష్ట్రీయ ఇస్పత్ నిగమ్ లిమిటెడ్' (ఆర్ఐఎన్ఎల్) పరిధిలోని భూమిలో 93,572.21 చదరపు గజాల విస్తీర్ణం గల 459 ప్లాట్లను ఆన్‌లైన్ ద్వారా (ఇ-వేలం) విక్రయించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్ బిడ్డింగ్‌పై అవగాహన కల్పించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని ప్రభుత్వరంగ సంస్థల విభాగం (డీపీఈ) ఆధ్వర్యంగల జాతీయ భూ ద్రవ్యీకరణ సంస్థ (ఎన్ఎల్ఎంసీ) 2026 అక్టోబరు 6న విశాఖపట్నంలో ఒక నమూనా ఇ–వేలం వేదిక ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించింది.

అక్టోబరు 12, 16 తేదీలలో నిర్వహించే ఇ–వేలంలో పాల్గొనబోయే వారు (బిడ్డర్లు) సహా ఆసక్తిగల భాగస్వామ్య సంస్థలకు దీనిపై అనుభవపూర్వక అవగాహన దిశగా విశాఖపట్నంలోని ఫెయిర్‌ఫీల్డ్‌లో మారియట్ సంస్థ అక్టోబరు 6న ఈ ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా "బిడ్డింగ్ స్వరూపం, పాల్గొనే విధానం, ఆన్‌లైన్ వేలం ప్రక్రియలోని ఇతర కీలకాంశాలను నిపుణులు వివరించారు. తద్వారా ప్రత్యక్ష వేలానికి ముందు బిడ్డర్లకు దీనిపై ఆచరణాత్మక అవగాహన కలిగింది. ఈ శిక్షణకు హాజరు కాలేకపోయిన వారి సౌలభ్యం కోసం అక్టోబరు 7న 'ఎన్ఎల్ఎంసీ' ఆన్‌లైన్ నమూనా ఇ–వేలం కార్యక్రమం కూడా నిర్వహించింది. రెండు దశలలో (12, 16) ప్రత్యక్ష వేలం నిర్వహించడానికి ముందు ఏర్పాటు చేసిన ఈ నమూనా వేలం డిజిటల్ బిడ్డింగ్ ప్రక్రియ గురించి తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో తొలి దశ ఇ–వేలం ప్రక్రియను అక్టోబరు 12న ఉదయం 11:00 నుంచి రాత్రి 7:00 గంటల దాకా నిర్వహిస్తుంది. అటుపైన రెండో దశలో అక్టోబరు 16న కూడా ఉదయం 11:00 నుంచి రాత్రి 7:00 గంటల వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

ఈ సందర్భంగా 'ఎన్ఎల్ఎంసీ' ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) శ్రీ రోహన్ చంద్ ఠాకూర్ మాట్లాడుతూ– "ప్రత్యక్ష వేలంపాటకు ముందు బిడ్డర్లకు డిజిటల్ బిడ్డింగ్ ప్రక్రియను పరిచయం చేయడం ఈ నమూనా వేలం ఉద్దేశం. తదనుగుణంగా వారు ఈ వేదిక గురించి అవగాహన పొంది, నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా లాంఛనాలను పూర్తి చేసేందుకు ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. వేలం ప్రక్రియను పారదర్శకంగా, సౌలభ్యంతో, బిడ్డర్లకు సానుకూలమైన రీతిలో నిర్వహించడమే దీని ధ్యేయం. 'ఆర్ఎన్ఐఎల్' ఆస్తుల ద్రవ్యీకరణ దిశగా ఈ భూమి వేలం ఓ కీలక అవకాశం కల్పిస్తుంది.

ఈ ప్రక్రియను వృత్తిగత నిపుణతతో, పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు 'ఎన్ఎల్ఎంసీ' కట్టుబడి ఉంది'' అని తెలిపారు.'ఆర్ఐఎన్ఎల్' భూ ఆస్తులలో విశాఖపట్నంలోని హెచ్‌బి కాలనీ, మద్దిలపాలెం, ఆటో నగర్, గాజువాక వంటి ప్రాంతాలలో 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో 459 విలువైన, ఎలాంటి అడ్డంకులకూ తావులని ప్లాట్లు ఉన్నాయి. గుర్తించిన ప్రదేశాలలో సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకూ వివిధ పరిమాణాల్లో ఈ ప్లాట్లను వేలం వేస్తారు. తద్వారా కొనుగోలుదారులు తమకు అనువైన ప్లాటును ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఈ మేరకు "రైల్‌టెల్ పరిధిలోని ఇ–నివిడా ఇ–ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా పారదర్శక, పోటీతత్వ ఇ–టెండర్–కమ్–ఇ–వేలం ప్రక్రియ ద్వారా ఈ ఆస్తుల విక్రయం సాగుతుంది. దీనికి క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్యూఐపీఎల్) లావాదేవీల సంప్రదింపుల సంస్థగా వ్యవహరిస్తోంది.

---

# మర్రిగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

## ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటాం. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్.



నల్గొండ, అక్టోబర్ 8: కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిని నిరసిస్తూ, ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మర్రిగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం రోడ్డుపై ధర్నా చేపట్టారు. బస్టాండ్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన కొనసాగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని తెలిపారు. ప్రజల గొంతుకను అణిచివేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, సర్పంచ్ పాదం రవి, జిల్లా కృష్ణయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడాల అల్వాల్ రెడ్డి, మండల నాయకులు మాస చంద్రశేఖర్, వెంకటంపేట బాలయ్య, రావుల రాములు, జంగిలి రవి, బూరెల బిక్షపతి, బడేటి కొండల్, బండి హనుమంతు, జమ్ముల వెంకటేష్, మాదగోని మహేష్, సిర్పంగి శ్రీను, గ్యార వెంకటేష్, సల్వోజు సంధ్య, శ్రీనివాస్, మల్లయ్య, రాజు, నర్సింహా, యాదయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# ఎంఐఎం బలోపేతానికి కలిసి పనిచేయాలి

## వర్గ విభేదాలను వీడి ఎంఐఎం బలోపేతానికి కృషి చేయాలి అసదుద్దీన్ ఒవైసీ పిలుపు

కరీంనగర్, అక్టోబర్ 8: (నేటినిజం ప్రతినిధి) వర్గ, గ్రూపు విభేదాలను పక్కనబెట్టి ఎంఐఎం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎంఐఎం అధ్యక్షుడిగా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, కరీంనగర్ టౌన్ అధ్యక్షుడిగా మహమ్మద్ అతీఫ్‌ను నియమించారు. హైదరాబాద్ దారుస్సలాంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన అధ్యక్షులకు అసదుద్దీన్ ఒవైసీ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా, పట్టణ కమిటీలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ సంస్థాగతంగా ఎంఐఎంను మరింత బలోపేతం చేయాలని సూచించారు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షుడిగా తనపై బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి గులాం అహ్మద్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. మూడు జిల్లాల్లో పార్టీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.